# కవితా కౌముది - 2015





శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 149



# విషయ సూచిక


| ఏడాది | నెల | కవిత పేరు | రచన | పేజి |
|---|---|---|---|---|
| 2015 | 01 | పండగల ప్రయాణం | డా నారాయణ గరిమెళ్ళ | 7 |
| | | నిరీక్షణ | సాంబమూర్తి చెల్లూరి | 8 |
| | | మీ పాఠకుడ్ని | స్వర్ణ అట్లూరి | 9 |
| | | పగిలిన హృదయం | బండారి శైలజ | 10 |
| | | క్షణమో యుగం | వేణు అడ్లూరు | 11 |
| | | ప్రయాణం | సుకేశిని | 11 |
| | | కొత్త సంవత్సరం | దీవి శ్రీనివాస్ | 11 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 12 |
| | | | | |
| 2015 | 02 | కనబడని కన్నీరో కౌతుకమో! | వెంకట్ | 13 |
| | | దృశ్యం | పి రామకృష్ణ | 14 |
| | | గేలి చేయకు దేన్నీ | విజయ చావలి | 14 |
| | | పచ్చనోట్ల చిలుకలు | బిక్కి కృష్ణ | 15 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 16 |
| | | | | |
| 2015 | 03 | నెగెటివిటీ | శారద శివపురపు | 17 |
| | | మరణమృదంగం | మధుకర్ వైద్యుల | 18 |
| | | అక్షరాలు | దేగల అనితాసూరి | 18 |
| | | నడక | చాంద్ | 19 |
| | | కవిత – కవిత్వం | కర్లపాలెం హనుమంత రావు | 19 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 20 |

| | | | | |
|---|---|---|---|---|
| | | | | |
| 2015 | 04 | శీత శ్రవణం | మరువం ఉష | 21 |
| | | మనిల్లు | ప్రఖ్యా మధుబాబు | 22 |
| | | మూలాధార చక్రం | పెరుగు రామకృష్ణ | 23 |
| | | నా హృదయంలోకి ప్రవేశించకు | లలిత చిట్టె | 24 |
| | | అద్వైతం | భమిడిపాటి స్వరాజ్య నాగరాజారావు | 25 |
| | | మనుసు క్యాబ్స్ | రాగ్ సావేరి | 26 |
| | | నా మొబైల్ ఫోన్ ఓ యోగి | వజ్రంశెట్టి పాండురంగ | 27 |
| | | గుండె చెరువయ్యింది | మధుసూదన రావు | 28 |
| | | విహారి | డా కురుమేటి కిషోర్ కుమార్ | 29 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 30 |
| | | | | |
| 2015 | 05 | అక్షరం | సాంబమూర్తి చెల్లూరి | 31 |
| | | కాలమా | సుందరశ్రీ శౌంఠి దువ్వూరి | 32 |
| | | నువ్వు చాలు | దీవి శ్రీనివాస్ | 33 |
| | | ఓ మాట విను | డా కోగంటి విజయ బాబు | 34 |
| | | క్షణాల శాశ్వతత్త్వం | అల్లూరి గౌరీ లక్ష్మి | 35 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 36 |
| | | పులస చేప స్వగతం | శిఖామణి | 37 |
| | | ఐనా రాస్తూనే ఉంటాను | ఫణీంద్ర రావు కొనకళ్ళ | 39 |
| | | ఉహించడానికేం ఖర్చు కాదులే | డా నారాయణ గరిమెళ్ళ | 40 |
| | | నీటి ముల్లె | ఐనంపూడి శ్రీలక్ష్మి | 42 |
| | | | | |
| 2015 | 06 | నేకేడ్ చైల్డ్ | వివేకానంద కొండపల్లి | 44 |
| | | మనసు | మల్లాది శ్రీ | 45 |

| | | | | |
|---|---|---|---|---|
| | | వెతుకుతున్నాను | స్వర్ణ అట్లూరి | 46 |
| | | పాదలేపనం కరిగిపోయింది | బిక్కి కృష్ణ | 47 |
| | | వెతుకులాట | ఎం వి ఎస్ ఎస్ ప్రసాద్ | 48 |
| | | కలత లేని రేయి | స్వప్న ఎం | 49 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 50 |
| | | కాస్త జాగ్రత్త తల్లి | ఇందుర్తి వెంకట ప్రభాకర రావు | 51 |
| | | ప్రకృతి కూడా దు:ఖిస్తుంది | కొండూరి రామరాజు | 52 |
| | | యువత మీ నడత మన ఘనత | ఆచార్య నడిమింటి శ్రీరాం | 53 |
| | | | | |
| 2015 | 07 | గోదావరి గమనం | అగ్నిహోత్రం ఉపేంద్ర | 55 |
| | | శైకత శైలి | డా ఎ రవీంద్రబాబు | 56 |
| | | దాదాపు తెలియకుండానే | ముకుంద రామారావు | 57 |
| | | ఎన్నాళ్లిలా | రేవతి కృష్ణ | 57 |
| | | అక్షరాయుధం | విజయకుమార్ బచ్చు | 58 |
| | | ఐనా | భమిడిపాటి స్వరాజ్య నాగరాజారావు | 59 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 60 |
| | | లోగిలి | ముళ్ళపూడి రవిచంద్ర | 61 |
| | | తాతయ్యగారికి | ప్రసూన రవీంద్రన్ | 62 |
| | | నిర్భయ మా ఈ లోకరీతి | ఏ మారుతి | 63 |
| | | ఆమె | మల్లెగోడ గంగాప్రసాద్ | 64 |
| | | | | |
| 2015 | 08 | మాటల వంతెన | స్వర్ణ అట్లూరి | 65 |
| | | ఆ ఒక్క మాట చెప్పి ఉండాల్సింది | బుర్రా సాయి బాబు | 66 |
| | | నిషేధం | ముకుంద రామారావు | 67 |
| | | అమ్మ | ఆచాళ్ళ శ్రీనివాస రావు | 68 |

| | | | | |
|---|---|---|---|---|
| | | బంధాలు | శారద శివపురపు | 69 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 71 |
| | | | | |
| 2015 | 09 | కావలసినదదే | ఎస్ ఆర్ బందా | 72 |
| | | ఉహో సుందరి | డా యం భారతి | 73 |
| | | సూర్యుడు | ముకుంద రామారావు | 74 |
| | | పోటీ పడలేని పోస్టు | భమిడిపాటి స్వరాజ్య నాగరాజా రావు | 75 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 76 |
| | | | | |
| 2015 | 10 | జనం కావాలి మనుషులు కావాలి మళ్ళీ | కర్లపాలెం హనుమంతరావు | 77 |
| | | మరో పుట్టుక దాకా | రామ జోగయ్య శాస్త్రి | 78 |
| | | ఆముక్తమాల్యద | స్వర్ణ అట్లూరి | 79 |
| | | భూమి | డా రావి రంగారావు | 79 |
| | | గుప్పెడు చీకటి | దూర్వాసుల విజయభాస్కర్ | 80 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 81 |
| | | | | |
| 2015 | 11 | స్పీడ్ బ్రేకర్ మీద | ఎస్ ఆర్ బందా | 82 |
| | | చెలీ | ఆచాళ్ళ శ్రీనివాస రావు | 83 |
| | | అంతర్మధనం | శ్రీకాంత్ ఒద్దిరాజు | 84 |
| | | నువ్వు – నేను | దీవి శ్రీనివాస్ | 84 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 85 |
| | | | | |
| 2015 | 12 | ఒకే కొమ్మ రెండు పువ్వులు | బిక్కి కృష్ణ | 86 |
| | | తిరిగి జన్మనివ్వు | అస్త్ర | 87 |
| | | వీడ్కోలు విమానం | డా కె గీత | 88 |

| | | | | |
|---|---|---|---|---|
| | | వ్యక్తిత్వం | రాజశ్రీ | 88 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 89 |

# పండగల ప్రయాణం

డా. నారాయణ గరిమెళ్ళ

కొత్త సంవత్సరం వచ్చినందుకో
సంక్రాంతి పంటలిచ్చినందుకో
భోగి మంటలతోనో
గాలి పటాలతోనో
ఎలాగైతేనేం
ఆలింగనాలూ ఆప్యాయతల మధ్య
జరుపుకోవడం ఎంత ఆనందం!
ఎప్పుడూ జరుపుకునే వాళ్ళనే కాదు
జరుపుకోని వాళ్ళని కూడా
తోచినట్టూ వీలైనట్టూ
జరుపుకోమనే చెప్పండి.
జరుపుకోవడం అనుభవమే కాదు
అవసరం కూడా!!
వాకిలడిగిందని ముగ్గులేస్తారా?
ద్వారాలు ఆడిగాయనే తోరణాలు కడతామా?
మనుషులనే కాదు
పశువులతో సహా ప్రకృతిని సైతం
ఎప్పుడో ఒకప్పుడు
ఏదో పేరుతో
అలంకరిస్తూనే ఉంటాం కదా
ఏమీ లేనితనం నుండీ ఏదో ఉన్న తనమే కదా
ఉనికంటే మరి!
పుస్తకము మధ్యలో నెమలి కన్ను పెట్టినట్టో
ఉమ్మెత్తాకు అంచుల్లో మొలకలకై చూసినట్టో
రబ్బరు బొమ్మకు మీసాలు గీసినట్టో
బొమ్మకూ బొమ్మకూ పెళ్ళి చేసినట్టో
అమావాస్య చీకట్లలో దీపాలు అమర్చినట్టో
అను నిత్యం జరుపుకోవడమే కదా జీవితం!
జీవితం పొడవునా
పేర్లు పెట్టినవే కాకుండా
ఏ పేరూ పెట్టనివీ పండగలు ఉంటుంటాయి
బోర్లా పడ్డ రోజు బొబ్బట్ల తోనూ
అడుగులేసిన రోజు అరిసెల తోనూ
పలికిన నాడు పంచదార చిలకలతోనూ
పది మంది నాలుకల మీదా తీపైనట్టు
సందర్భాన్ని సృష్టించో
సృష్టించిన దానికి స్పందించో
జరుపుకుంటూనే ఉండాలి.
మైలు రాళ్ళనే కాదు
మీటరు మీటరు కి ఉన్న రాయిని గుర్తించి
చిన్నదో పెద్దదో
పండగొకటి చేసుకుంటూనే ఉండాలి!
పడిపోయి దెబ్బ తగిలినప్పటి పాఠాలుంటాయి
అందుకో బోయి అలసినట్టి ఆరాటపు
అనుభవాలుంటాయి!!
నేర్చుకుంటున్నప్పుడూ
నేర్చుకుని ప్రయత్నిస్తున్నప్పుడూ
ప్రయంతించి ఫలించినప్పుడూ
జరుపుకోకుండా ఎలా ఉండగలం?
జరుపుకోవడం మరొకరి దుఃఖం కానప్పుడు
జరుపుకోవడం వేరొకరి చెవుల్లో జోరీగ
కానప్పుడు
జరుపుకోకుండా ఎలా ఉండగలం?
కళ్ళున్నందుకు
కళ్ళ నిండా ఆరోగ్యమైన చూపున్నందుకు
కాళ్ళున్నందుకు
కదలికున్నందుకు
నిండా పరిపూర్ణ జీవమున్నందుకు
జీవించి ఆనందించాలనే కోరిక ఉన్నందుకూ
జరుపుకోవాలి కదా!
నైరాశ్యాల నుండి
ఊడిగపు దాస్యాల నుండి
యాంత్రికపు మూసల నుండీ
బయటపడి
తలెత్తుకుని విరబూసి తిరిగేట్టు
కొత్తగా కొత్త సంవత్సరం లా
కాలంతో కదులుతూ కవిత్వీకరిస్తూ
జరుపుకుంటూనే ఉందాం.

★★★

# నిరీక్షణ

సాంబమూర్తి చెల్లూరి

ఎదురు చూస్తుంది

నిలువెల్లా పడిన ముడతలనే
కళ్ళల్లో వత్తులు చేసుకొని
ఆమె ఎదురుచూస్తుంది

డాలర్లమేతకు వెళ్లిన వలసపక్షి
ఎన్నేళ్ళయినా కన్నవారినీ ఉన్న ఊరినీ
కడగంటైనా చూడనపుడు
విరామమెరుగని
ఎదురు తెన్నులే మిగిలాయి

మస్తిష్కపు చరవాణి పంపిన
వేనవేలు సందేశాలు
అందే ఉంటాయన్న ఆశతో
ఆమె ఎదురుచూస్తుంది

అనంత సాగారాలకావల
ఉజ్వలంగా వెలిగే స్వేచ్ఛా జ్యోతులను
తీసుకు వస్తాడని ఆశతో కాదు

చిక్కి శల్యమైన శిథిలాలయాన
చిరుదివ్వె వెలిగిస్తాడనే కోరికతో
ఆమె ఎదురుచూస్తుంది

ఉన్నపళంగా వెళ్ళాలనే ఆత్రంలో
విలువైనవే మర్చిపోయాడు

సావాసగాళ్ళతో ఆడిన కోతికొమ్మచ్చి
ఇంటిముందున్న చెట్టుకొమ్మపై
జ్ఞాపకమై వేళ్ళాడుతోంది

ఊరి కోనేటిలో
ఈదులాడిన బాల్యం గురుతులు
చేపపిల్లలై ఎదురుచూస్తున్నాయి

చిన్నిపెదవులను తాకిన
ఆమె అమృతహస్తం
ఇప్పటకీ మారాం చేస్తుంది
కొడుక్కి
గోరుముద్దలు తినిపించాలని

ఎప్పటికైనా వస్తాడనే ఆశతో

తనువంతా ప్రాణమై

ఆమె ఎదురు చూస్తుంది

****



# మీపాఠకుడ్ని

స్వర్ణ అట్లూరి

కథ అయినా, కవిత అయినా
పాట అయినా, పద్యం అయినా
చదువుతాను ఎవరేమి రాసినా
మనసంతా కళ్ళు చేసుకుని!
గతిలేక కాదు, మతిలేక కాదు
చేతకాక కాదు, చేవలేకా కాదు
నాకోసం ఇన్ని వర్ణచిత్రాలు మీరంతా సృష్టిస్తుంటే
ఆ అందాలను అనుభవిస్తూ నేనున్నాను!!
కవితను ఆస్వాదించే మనసుంది కానీ కాను కవిని
సాహిత్యాన్ని ప్రేమించే హృదయం ఉంది కానీ కాను సాహితీవేత్తను
పద్యాన్ని అర్థం చేసుకునే చదువుంది కానీ కాను పద్యకారుడ్ని
కథలలో విహరించి రాగలను కానీ కాను రచయితను..!!
మీలా ఒక్కటే జీవితం కాదు నాకు
రోజుకో క్రొత్త జీవితం జీవిస్తాను
క్షణానికో మలుపు తిరుగుతూ
వింత లోకాలు విహరించి వస్తాను కాలు కందకుండా!!
ఓ సందర్భాన్ని వర్ణ చిత్రం లా ఆకట్టుకునేలా చూపినా
ఒక సంభాషణని కళ్ళకు కట్టినట్లు రాసినా
కష్టం కళ్ళముందు చూపి ఏడిపించినా
సంతోషం మనసుని తాకేలా చేసి ఆనందభాష్పాలు రప్పించినా -
విప్పి చెప్పండి మీ భావాలన్నీ మనసు బరువు తీరేలా
ఎంత వడ్డించినా ఆబగా తినే నేనుండగా
చెప్పని కథల గుండె బరువులు దింపేయక ఆలస్యమేలా
తాకండి నా మదిని స్నేహం, ప్రేమ, ద్వేషం, బాధ్యత ఏ బంధం తో అయినా!!
ఊహా లోకంలో రెక్కల గుర్రం మీద విహారం చేయించినా
వివాహ భోజనంబు అన్నట్లు ఎన్ని రుచులు వడ్డించినా
బాటసారి లా ఏ తీరాలకు తీసుకెళ్ళినా, స్పందించేందుకు నేనున్నా...
మీ పాఠకుడ్ని ... మీ భాషలో పుస్తకాల పురుగుని!!!

★★★★

# పగిలిన హృదయం

బండారి శైలజ

అద్దం పగిలిపోయింది -
పగిలిన ముక్కల్లో ప్రతిఫలించే ప్రతిబింబాలు
ఒకటి నిర్మలంగా,నిస్తేజంగా
మరొకటి అరుస్తూ,గొణుగుతూ
ఇంకొకటి అసూయతో,ద్వేషాగ్నితో
నన్ను వెక్కిరిస్తున్నట్టు , గ్రుచ్చి,గ్రుచ్చి ..
ప్రశ్నల శరాలు సంధిస్తున్నాయి!
శరాఘాతాలకు దేహం మళ్లీ ముక్కలవుతూ
జ్ఞాపకాల గాయాలకు నెర్రెలు తీసిన మనసు!
పగుళ్ల నుంచి స్రవించే ప్రతి రక్తపు చుక్క
వియోగ వేదనను ప్రసవిస్తూ.
ఉవ్వెత్తున ఎగసిన కెరటమొకటి
గాయాన్ని కడిగేస్తోంది!
రెక్కలు కట్టుకుని ఎగిరిన నా ఆశ
నా నుండి విడివడి మరెవరిలోనో లీనమవుతూ
నింగికెగరేసిన బంతిలా లక్ష్యం
అందుకోవాలనుకుంటూ పడిపోతూ,
**అడ్డంకులను అధిగమించలేక**
నాలో నేను ఒక సుడిగుండాన్నై
నాలోకి నన్ను లాగేసుకోలేక
లోపలి గాయాలకు మందు పూయలేక
నేలరాలుతున్న శిథిలస్వప్నాలను అందుకోలేక
నిరాశ ముసుగును ధరించి
విషాదఛాయల్లోకి, కన్నీటి పాయల్లోకి..లోలోకి
పాకుతూ............!!
ఒంటరిగా.......
పగిలిపోయిన గాజు అనుభూతులను ఏరుకుని
ప్రోగు చేసుకుంటున్నా!!
దిక్కులను,మూలలను కలిపి
ముక్కలైన హృదయాన్ని అతికిద్దామని
పగిలిన ముక్కలు కొన్ని
శరీరాన్ని చీలుస్తూ
రక్తాభిషేకం చేసుకుంటున్నాయి!!!
గాయం లోంచి చిగురించే స్మృతుల మృదుస్పర్శ
హృదయాన్ని తడుముతూ
మనసు వాకిలిలో...
కన్నీటి కళ్లాపి చల్లుతున్న కళ్లు
మసకబారిన వలపు రంగుల్లో
రంగవల్లికను ఎలా దిద్దను!!?
గాయాలు స్రవిస్తున్న
రుధిరబిందువులను రంగులుగా అద్దడం తప్ప!!!

★★★★



## క్షణమో యుగం
### వేణు అడ్లూరు

అప్పుడెప్పుడో
కృతయుగం లో, త్రేతాయుగం లో
మనుషులు వేల ఏళ్ళు బ్రతికేవారట...
దేవతలు యుగాలు బ్రతికేస్తారట...
అది విని మనవాళ్ళంతా నోళ్ళు తెరిచేస్తారు...
అందులో ఆశ్చర్యం ఏముంది??
కలియుగం లో నేను లేనూ?!!
ఔను...
ఇప్పుడు నా వయసెంతో తెలుసా?!
కొన్ని వందల యుగాలైయుంటుంది!!
ఇంకా కొన్ని వేల యుగాలు బ్రతుకుతానేమో!!!
ఔను ప్రియా!!!
నీవు లేని ప్రతిక్షణం నాకొక యుగం!!!

★★★★

## ప్రయాణం
### సుకేశిని

అలవాటుపడిన దారుల వెంట
ఆవేశపు అడుగులు
ఆకృతులు కోల్పోయిన ఆనవాళ్ళు
ఏవీ నే పాతేసిపోయిన
బాల్యపు స్మృతులు..
ఒకటా.. రెండా.. ఎన్నని!
గంతులేసిన బాల్యం నుండి
మొగ్గతొడిగిన యౌవ్వనం వరకూ
ఎంతహాయి..
గుండెలోతుల్లోంచి పొరలు పొరలుగా
తన్నుకొస్తున్న జ్ఞాపకాలు..
కలిగి కన్నీరై జారుతుంటే!
ఎంత తియ్యదనం
శిథిల జ్ఞాపకాలను పదిలపరచుకుని
కొంచెంకొంచెంగా నెమరేస్తుంటే!!

****

## కొత్త సంవత్సరం
### దీవి శ్రీనివాస్

తాలిమి తన దేహమైన
త్యాగమె తన దాహమైన
స్నేహానికి చిరునామా నీవైతే,
మంచితనం సువాసనగ
వంచన ముళ్ళే లేని
పూచిన గులాబీ నీవైతే.
ధీరత్వమె దారముగా
శూరత్వమె సూత్రముగా
పయనించే పతంగి నీవైతే,

గుండెలోని మానవత
పొంగి పొరలి ప్రవహించే
కొండవాగు నీవైతే,
ద్వేష ధ్వాంతమును చీల్చి
ప్రేమ కాంతిని పంచే
చిరుదివ్వె నీవైతే -
కలసి నడుస్తానన్నది కొత్త సంవత్సరం!
వలచి వేస్తానన్నది ఆనందపూలహారం!!

★★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

సౌఖ్యపూరితమై కొన్ని జన్మలుండు
చిరము కష్టములే కొన్ని జీవితముల
ఎట్టి జీవితమ్ములు తనకెదురు పడిన
ఆత్మ మరల మరల యిలకరుగుదెంచు

ఎన్ని జన్మలతోడ సంధింపబడిన
జీవితములెన్నొ యనుభవించినను గాని
విసుగు చెందని యాత్మకు ప్రేరణేమి?
ఏల పలుమార్లు తాను జన్మింపనెంచు?

కష్టసుఖముల వలయమ్ము కాన రాని
ఇలకతీతమౌ లోకాననేమి కొరత?
ఈ శరీరమ్మునాశింప హేతువొకటె
ప్రేమ యొసగెడుననుభూతి విడువలేక

అంతు లేనట్టి వెతలెదురైన గాని
వెలితి యెరుగక నిలిచెడు ప్రేమ వలయు
రాగరహితమౌ స్థితికి సార్థక్యమేమి?
ప్రేమకై యాత్మ తిరుగాడు భూమి యందు

ప్రేమ పంచగలేని జీవితము వలదు
రాగమును పొందజాలని బ్రతుకు వలదు
ఇలను మనుటకు సార్థక్యమేమి యనిన
నిత్యమౌ ప్రేమనెల్లెడ నించు కొరకు

# కనబడని కన్నీరో...కౌతుకమో! వెంకట్

నీ నైజం
వెలుతురులో కన్న చీకటిలో
ఎందుకంత నవీనంగా కనబడుతుందో
నా కెప్పుడూ అర్థం కాదు.

చీకటిలో నీ వదనం కనుపించినంత స్పష్టంగా
వెలుతురులో నా ముఖం కూడా నాకు
కనబడదెందుకనో...

నిశ్శబ్దంలోకన్నా నీ నవ్వు
నేనప్పుడు పోగొట్టుకున్న ఏటిగలగలలలో
నిలువెల్లా మెరుస్తూ ఎన్నిసార్లు అలా
సాక్షాత్కరిస్తుందో...

నా బాల్యం నీడ నా శరీరాన్ని వదిలి
నీ పమిటచెంగు చాటును
ఎప్పుడూ ఎందుకు  అంతగా ఆశ్రయించుకుని
వుంటుందో...

నువ్వు నాలో చెరుకుచెరుగ్గా పారేసుకున్న
నీ మాటల రహస్యాలను
ఎన్నిసార్లు నీవిక మరి తిరిగి అడగవన్న తపనలో
ఎలా సహిస్తూ ప్రవహిస్తూ వున్నానో...

అక్కడ
ఆ వెన్నెల రాత్రుల అమోఘ సానువుల క్రింద
ఎప్పటికప్పుడు నిన్ను అడగకుండానే నేను దాచేసి
వుంచుకున్న
ఆ మోహాశ్రు శకలాల మౌన సంచయాలు
ఎన్నెన్ని సార్లు ఇలా ఈ దేహాన్ని
దవానలమై గేయపరుస్తూ వుంటాయో...

ఇది ఏమో
కలయో నిజమో
కనబడని కన్నీరో
విడిపడని కౌతుకమో!

★★★



## దృశ్యం
## పి.రామకృష్ణ

చేరుకోడానికి
ఇద్దరిమధ్యా
ఒకే తలుపు.

తెరవడానికి ఎపుడూ
ఒకేసారి ప్రయత్నిస్తాం ఎపుడూ.

తెరవాలనుకునే తలుపు
ఒకటే
ఇద్దరిమధ్యా.

నువ్వు తెరుస్తావని నేనూ,
నేను తెరుస్తానని
నువ్వూ..

తెరుచుకోడానికి
ఇద్దరిమధ్యా
ఒకటే తలుపు.

నువ్వే తెరవాలని నేనూ.,
నేనే తెరవాలని
నువ్వూ..

ఇద్దరిమధ్యా
ఒకటే-
ఇక ఎప్పటికీ తెరుచుకోని,
అదే తలుపు.

★★★

## గేలి చేయకు దేన్నీ
## విజయ చావలి

నివురు నుండి నిప్పు జనియిస్తుంది
సమ్మెట పోటుకు లోహం రేకవుతుంది

పడిన కడలి తరంగమే పైకి లేస్తుంది
స్తబ్ధత తరువాతే తుఫాను విజ్రంభిస్తుంది

గేలి చేయకు దేన్నీ
దేని ప్రతిభ దానిదే

సాగిన తీగ కంపిస్తేనే
నాదం వినిపిస్తుంది.

కోటి గొంతుకల ఆక్రందనే
ఉద్యమానికి నాంది గీతం పాడుతుంది

దేహమైనా మనసైనా
బాధతో కంపిస్తేనే
మహా మనిషి ఉద్భవమవుతుంది.

కష్టాల కడలి ఈదిన వారికి
కన్నీళ్ళ చెమర్పు కనిపిస్తుంది
బాధల తడి నడిపిస్తుంది!!

★★★



# పచ్చనోట్ల చిలుకలు

బిక్కి కృష్ణ

పచ్చనోట్ల చిలుకలు ఇంట్లో పెంచుకోండి!
కొన్ని ప్రభావాలు భ్రమల అలలై నిన్ను ముంచేస్తాయి
కొన్ని ప్రలోభాలు నిన్ను సుఖాల సుడిగుండంలోకి తోచేస్తాయి
ఇప్పుడంతా పచ్చనోట్ల చిలకల వేటలో పరుగులు తీస్తున్నారు
విలువలు సిద్ధాంతాలు పాతపుస్తకాల గోతుల్లోనుంచి తోడుకున్న
పాచిపట్టిన నీళ్లుగా మారిపోతున్న సందర్భంలో
సరికొత్త విలువలతో గ్లోబల్ మార్కెట్
నీ ఇంటి గుమ్మంలోకి చాపకింద నీరులా ప్రవేశించి
నిన్ను నీ కుటుంబాన్ని నీ ప్రేమల్ని స్నేహాల్ని
నీ అనుభూతుల్ని చివరకు నీ జీవిత మొత్తాన్ని
నేటి మార్కెట్ విలువలతో అంచనా వేస్తోంది!
ఇక్కడ పచ్చనోట్ల చిలకల వేటగాని ప్రభావానికి
అరణ్యాలేకాదు జనారణ్యాలన్నీ లొంగిపోతాయి
ప్రభుత్వాలు తాకట్టు పెట్టబడతాయి!
ప్రభువులు ప్రజలకు పెట్టుబడిదారులకు మధ్య
దళారీలుగా పనిచేస్తూ దర్జాగా బతికేస్తుంటారు
పచ్చనోట్ల చిలకలప్రభావం వల్లనేకదా
కలలన్నీ వెండితెరపై రంగుల కలలుగా రూపాంతరం చెందింది!
కళాకారులు రంగుమార్చే ఊసర వెల్లలుగా మారిపోయింది!
చెక్కుల్లో చిక్కుకున్న చిక్కుముడి కదా జీవితం!
పచ్చని చిలకలకోసమే కదా దేశంలో కోట్ల కుంభకోణాలు
జరిగింది
లంచాల ప్రభావం వల్లనేకదా ప్రజలు చెల్లని నాణేలుగా మారింది
చివరకు మార్కెట్లోచవకబారు వస్తువులుగా అమ్ముడుబోయింది!

నేలను నీటిని పాడిని పంటలను
అన్నీ కోల్పోయిన రైతన్నలు ఆలుబిడ్డల ఆకలి తీర్చడం కోసం
కర్పొరేట్ ఆసుపత్రుల్లో కిడ్నీలు కారుచౌకగా
అమ్ముకొంటున్నారంటే!
చదువుకున్న మేధావులు ప్రభుత్వ కార్యాలయాల కచేళాల్లో
అధికారపార్టీ ఫైళ్లకు బలిపశువులవుతున్నారంటే
పచ్చనోట్ల చిలుకల ప్రభావమేకదా?
మాయలపకీరు ప్రాణం మర్రి చెట్టుపైఉన్నచిలకలో ఉన్నట్టు
ఈ దేశాన్ని దోచిన దొంగల ప్రాణాలన్నీ...
స్విస్ బ్యాంకులో దాచిన పచ్చని చిలకల నోట్లకట్టల్లో
ఉన్నాయి
మరి పాపం మోడీ ఆ చిలకల్ని పట్టితెచ్చి
ప్రజల్ని బతికిస్తాడో లేదో గాని !
మీరు మాత్రం బతికి బట్ట కట్టాలంటే నాలుగు పచ్చని
చిలకల్ని
మీ ఇంటి పంజరంలో బంధించడం మాత్రం మరచి పోకండి!
ఎందుకైనా మంచిది.....
బజారుకెళ్ళేవేళ నాలుగు పచ్చనోట్ల చిలకల్ని
మీ జేబుగూట్లో వేసుకెళ్ళండి!

★★★



# రసరేఖలు

## శ్రీధర్ బచ్చోటి

ప్రేమ పంచగలేని జీవితమునందు
స్వార్థమే తప్ప వేరొక యవధి లేదు
హృదయమొక నాడు ప్రేమార్థమెరిగినంత
త్యాగమే జీవితపు పరమార్థమౌను

ఎవరికొక తున్కయును ప్రేమనీయలేక
తనదు హృదయంపుటెల్లల దాటలేక
బ్రతుకు మానిసి జన్మ సాఫల్యమేమి?
త్యాగమెరుగని బ్రతుకు సార్థక్యమేమి?

ఏది యానందమిచ్చునో యెరుగలేరు
ఎదను మాయు దారుల పరువెత్తుచుంద్రు
వత్తి వెలిగించి కాంతిని పంచలేక
వెలుగు వీడెదరు తమ జీవితములందు

తనను మరచి యీ సువిశాలధాత్రి యందు
ఎవ్వరో యొక్కరికి ప్రాణమీయవలయు
పంచుకొనవలయును ప్రేమబాష్పములను
తనదు సర్వమ్మునర్పించి తనియవలయు

చెలియ! నీ కొరకే నాదు జీవితమ్ము
నా యెడందయు యోచనల్ నా మనస్సు
నాది యన్నది సర్వమ్ము నీదె యౌను
నీకొసంగనిదేదియు నాకు వలదు

# నెగెటివిటీ

శారద శివపురప్పు

అనంత విశ్వాన్ని చుట్ట చుట్టి నీ మనసు వాకిలి ముందు
తారల నగిషీల తివాసీలా పరువగలను
కానీ నీకొక వాకిలుందని నువు మరచావు.

కొన్ని నదీ ప్రవాహామృతాల్ని పట్టి తెచ్చి
పొడిబారిన నీ గొంతు తడపగలను
కానీ నువు నీ దాహాన్ని మరచి బతుకుతున్నావు.

మిన్నుల వెలిగే వేయి చందమామల వెన్నెల వొంపుకుని
నీ కోసం నీ కన్నుల చల్లని వెలుగుపూలు పూయించగలను
కానీ  రెప్పల చీకటి మాటున సేదదీరే నీకు వెన్నెల వేడిగా
ఉంటుందంటావు.

సము ద్రగర్భంలోని నిశ్చలతను, తీరంలోని అల్లరి  అలలను
నీ జీవన గమనంలోకి అలవోకగా మళ్ళించగలను
కానీ ఎడారిలో ఒంటరి పడవ ప్రయాణం నీ జీవితం.

వేల తారల తళుకులన్నీ మూటకట్టి
మిణుగురుల్లా నీ దోసిట నింపగలను
కానీ దోసిలి తెరిస్తే, బంధించిన వెలుగు ఎగిరిపోతుందని భయం
నీకు.

అగాధంలోంచి ఆకాశమంత ఎ త్తుకి ఎదిగిన
అద్భుత వ్య క్తుల జీవిత రహస్యపుటలను విప్పగలను
కానీ ఈ రోజుకి నువు నీ గతంలోనే బతికున్నావు.

ఈరోజుకి నువు నాకు చచ్చి కనిపి స్తున్నావు
జీవిత చివరి ఘట్టపుటంచున ఉన్నావని మరు స్తున్నావు
చిగురు తొడగ మొరాయించి ఎండిన మో డై బతికే స్తున్నావు.

స్మశానంలాంటి గతంలో కాలి బూడిదయిన జ్ఞాపకాలకి
కొ త్త ప్రాణం పోసుకుంటూ నువు భవిష్య వాణిని మైమరిచి
వింటున్నావు
అరచేత అద్భుత జీవన మిధ్యా రేఖల్నేవో గీసుకుంటున్నావు.

నువు ఖూనీ చేసి సంతోష పడుతున్న ప్రతి క్షణం నీ కోసం
పుట్టినందుకు
అజ్ఞాత స్మశానంలో సమాధయ్యే అనామక శవంలాగా
తన జ్ఞాపకంగా రాయడానికొక పేరు లేక విలవిల్లాడుతోంది.

ఈ ఒక్క క్షణంలో నువు జీవి స్తే ........................
నీకు జన్మ జన్మల సంతోషాలను పంచి ఇచ్చే ఆ ఒక్క క్షణం
నేనవుతాను
అది తెలుసుకునేందు కైనా ఈ ఒక్క క్షణంలో నువు జీవించు
చాలు.

★★★



## మరణమృదంగం
### మధుకర్ వైద్యుల

కరుణే లేని కాలపురుషుడా..!
మానవత్వం మరణించినచోట మనిషిని మనిషే చంపుకునే
కనికరమన్నా లేని కసాయి మనుషుల మధ్య కని పారేస్తావు,
బంధాల బంధీఖానలో నన్ను బానిసకొక బానిస చేసి
నిత్యం చావుబతుకుల మధ్య చావలేని బతుకునిస్తావు,
రాయి, రప్ప, చెట్టు, చేమలన్నీ నీ మహిమలేనని తలచి
కోటి కోరికలతో కొలిచి మొక్కితే ఎప్పటికో కడుపు పండిస్తావు,
ఎదుగుతున్న పసివాళ్ళను ప్రాణం లా ఎదల నిండా దాచుకుని
కంటికి రెప్పలా కాపాడుకుంటుంటే కన్నుకుట్టి కాటేస్తావు,
బడికి పొమ్మని బస్సెక్కించి టా టా బైబై అని సాగనంపితే
మాసాయిపేటలో మరణ మృదంగమై మాయం చేస్తావు,
ప్రపంచ పటం మీద పాలస్తీయన్లుగా పుట్టడమే పాపమన్నట్లు
ముక్కుపచ్చలారని ముద్దు కూనలను మాంసపు ముద్దల చేస్తావు,
పుట్టిన బిడ్డలందర్ని పొట్టన పెట్టుకుని మమ్మల్ని ఒంటరి చేసి
నీవిచ్చిన మానవజన్మను మానని గాయంగా మిగుల్చుతావు,
అయ్యో బిడ్డా! అప్పుడే నీకు నూరేళ్ళు నిండాయా? అని
ఏడుస్తుంటే
జరిగిన మారణ హోమాన్ని సైతం మరచి మనసు చంపుకుని
వీక్షిస్తావు,
జీవితమంతా ప్రేమానురాగాలు చెరిపేసి ఒంటరితనాన్ని కానుక
చేసి
మానుతున్న గాయాలను జలిపిస్తూ నూరేళ్ళ జీవిత మెందుకిస్తావు,
ఏడుస్తూ పుట్టి, ఏడుస్తూ పెరిగి, ఏడుపే జీవితమయ్యే జీవితం
నాకొద్దు
ఎవ్వరికి పట్టని ఎవ్వరికి నచ్చని ఈ మానవజన్మకు మరో జన్మ వద్దె
వద్దు.!!

★★★

## అక్షరాలు
### డేగల అనితాసూరి

అక్షరాలు జీర్ణంకావాలి
ఆహారం పచనంచేయాలి
నమలాలి మ్రింగాలి
అప్పుడే అరుగుతుంది ఆరోగ్యకరంగా,
అక్షరాల్లో ఘనత ఉండాలి
కానీ ఘనంగా కాదు,
కలం గరిటె వడ్డించిన కాగిత పాత్రలో
కలిగించే స్పందనుందో
కలిగి నీరైన వేదన ఉందో
పొంగిపొరలే ఆనందముందో
పొగిలి రగిలిన ఆక్రోశాన్నే దాచుకుందో
పాఠకుడి మనసుకి
తేలికగా అర్థమవ్వాలి,
అప్పుడే ఆ భావరూప సృష్టికి సార్థకత!
పండితుడికి చెప్పనవసరంలేదు
పామరుడికి అర్థమవని రీతిలో
మితిమీరిన భాషాప్రయోగంతో రారెత్తిస్తే
రుచిఎరుగని అక్షర ప్రయోగానికి ప్రయోజనంలేదు,
నిఘంటువు వెదికే సృష్టి అజీర్తి కలిగిస్తుంది
సరళ భావుకతతో ఆస్వాదించగలిగి
అక్షరాన్ని జీర్ణించుకుని ఆకళింపుచేసుకున్నప్పుడే
మనోల్లాసం కలిగిస్తుంది!!

★★★

## నడక
### చాంద్

నడిచినప్పుడు
పచ్చటి చిగురులు వెనుక రాలిన ఆకుల్లా
అడుగుల గుర్తులు మిగిల్చిపోతుంటాము

పాదాలకు గుచ్చుకున్న జ్ఞాపకాలతోనే
మనల్ని కార్చుకుంటూ సాగిపోతాము

దూరం దగ్గరవ్వని పరుగు పందెంలో
లోకాన్ని గెలిపిస్తూ మనం ఓడిపోతాము

నడిచే తొందరలో
మనల్ని కూడా ప్రేమించడం మరిచిపోతాము

★★★

నడక తప్పక ఆపాల్సినపుడు
సమాధిలోనికి ఏమి తెసుకెళ్తాం

ప్రేమగా విత్తనాలు జల్లి ఉండాల్సింది
విరబూసిన హృదయాలు కన్నీరైనా ఇచ్చేవి
★★★

జీవితాన్ని ప్రేమించింది కనుకే
కొన్ని గంటలైనా పువ్వు అందంగా నవ్వగలదు
★★★

## కవిత - కవిత్వం
### కర్లపాలెం హనుమంతరావు

పథ్యం
నేపథ్యం
జాలి
జోల
కొలుపు
కొలువు
పానకం
పూనకం
ప్రేమ
చేమ
పాట
మాట
శబ్దం
నిశ్శబ్దం
మందు
మందు గుండు
సందోహం
సందేశం
ఇన్ని కలిస్తేనే
కవిత్వం.
★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఏల యీ దారిలో పయనించుచుంటి
మనసుకిసుమంత నచ్చని మార్గమిద్ది
ఏ విచిత్రశక్తి యిటు నన్నీడ్చుచుండె
తిరిగి వెనుకకు పోవ సందియమిదేమి

అన్యులేమనుకొందురో యన్న యూహ
ఎవరి మనసును రవ్వ నొప్పింపలేమి
పరులనెల్లరనామోదపరచు వాంఛ
కలసి నేర్పెను నాకు త్యాగమ్మునివ్వి

ఇది సరియయినదో కాదొ యెరుగలేను
తెలియునెల్లవారలు సమ్మతింతురనుచు
సంశయించుటకించుక సమయమేది
కాలమంతయు పరులకే కానుకయ్యె

ఏదొ మేల్కొలుపేనాడు హెచ్చరించి
ఈ యశక్తతనుండి మళ్ళించె నన్ను
ఆత్మ సూచించు మార్గాననరుగనెంతు
ఒరులకై నాదు మార్గమ్ము మరువనేల

నీదు స్నేహాన లేవు సందియములేవి
పరుల యామోదమున కవసరము లేదు
మనసు తెల్పెను నీవె నా మార్గమంచు
అన్ని వేళలనిట్టి స్థైర్యమ్ము వలయు

**చిత్రాలు: వజ్రంశెట్టి పాండురంగ**



# శీతస్తవకం

– మరువం ఉష

చిదుగులు రాలుతుంటాయి
ఏదో ఒక దిక్కు నుంచి గాలి వీస్తుంటుంది

మాగిన పూరేకులు, పలకమాగిన పళ్ళు కంటి చూపు మేరా-
రంగులు మారిన ఆకుల వెనగ్గా ముసురు తొలకిళ్ళ ఆకాశం
చిగురు తొడుగుతున్న తీగకిక సమయం లేదు
విచ్చీ విచ్చని మొగ్గలూ ముగిసిపోతాయిక...

వడిలిపోతున్న ఆకులు, వెచ్చని ఉభయ సంధ్యలు సెలవు తీసుకోనున్నాయి

గుబులుగా ఉడుతలటూ యిటూ తిరుగాడుతూ పికాన్ నట్స్ పోగేసుకుంటూ
కుదురుగా పిట్టలూ అదే పనిగా మట్టి గుట్టల్లో, చెట్టు తొర్రల్లో తవ్వితోడిపోస్తూ
ఉన్ని దుస్తులు, తోలు పాదరక్షలు వెలికి తీసి ఉసూరంటూ అందరమూ
వచ్చి పోయే శీతువు ని ఎప్పుడూ కొత్త ఋతువుగానే ఊహిస్తూ...

నిరుడు, ఆ మునుపటేడూ ఇవే మాటలు చెప్పుంటాను, ఊసుల రాసి పోగుపడుతుందిలా మరి!

★★★

# మ"నిళ్ళ"

– ప్రభాకర మధుఖేలు




మనసు ..తలుపు తెరిస్తే
ఓ మనసు తలపు తెలిస్తే
కళ్ళ వాకిళ్ళ లోగిళ్ళలో
చింపిన కాగితాలు
మనసు ప్రేమలేఖలు!
అసలు ప్రేమలేక-లు!!

''అసలు'' మనుషుల్లేని పొడుగిళ్ళు,
పేకమేడల పొరుగిళ్ళు!
దేవుడు లేని గుళ్ళు
నాకన్నా అందని హుండీలు
ఊడిన గుండీలు
వాటి వెనక దాగిన భయం గుండెలు
అశించినా అగుపించని అండదండలు
ఎవరికి కం-కాళ రాత్రులు?
ఎవరా దివ్యచైతన్య పాత్రులు?
ఎవరికి నిర్జీవ దండలు?

బిలియన్ జనాల భూమ్మీద దేవుళ్ళకేం కరువా?
నడిచే మనిషికి లేని విలువ శిలువా ?!

స్ఫూర్తి లేని జీవితం
పూర్తి కాదన్నావు
ఆర్తి లేని జీవితం
అందం గా లేదన్నావు
సాహిత్యం సంద్రమన్నావు
చందమామ బంధమన్నావు
ఆకసం అంత ఎత్తు ఎగరాలని
విహంగాలనమర్చుకున్నాక
సారంగాల, స్వరంగాల, అంతరంగాల లో
ఈ పెను తుఫాన్ ని, పెన్నులు ఆప లేవు!
కన్నీళ్ళ కథలన్నిటినీ కవితలు రాయలేవు!!

ఓ మనసా చాలు, వచ్చెయ్ ఇంక మనింటికి !
కనిపించు మూసేలోపు ఈ కంటికి !!

★★★

# మూలాధార చక్రం

### - పెరుగు రామకృష్ణ



దేహం లోపలి అంతర్భాగం లోంచి మేల్కొంటా
గాయాన్ని, గేయాన్ని ముద్దాడిన పుష్పాన్నై
వెన్నెముక దేహానికి గుండెని పుష్పాన్ని చేసి...

దేవా ..!
నీ కోసం కన్నీటి ప్రయాణం లోని నావనవుతా
అగాధాల నుంచి ఆకాశం వరకు నిరీక్షించి
రెప్పల్ని మూసినా ప్రేమనే కలగంటా

దేవ దేవా ..!!
ప్రేమించడమే నేర్పినందుకు ధన్యవాదాలు
నువ్వు కోరుకుంటే
ఓ చిరునవ్వై మూలాధార చక్రం ముందు మోకరిల్లుతా
తల్లి ప్రేమని ,తండ్రి దండనని శిరసా వహిస్తా
అస్త్రాన్ని ముట్టుకోవడం తప్పుకాదు కదా ..?
అందుకే
శాంతినే అస్త్రంగా ధరిస్తా ...
ప్రపంచం ముందు కవిత్వమై పల్లవిస్తా ...

దేవాది దేవా ..!!!
గొంతిచ్చినందుకు కృతజ్ఞతలు
గాయాన్నయినా , గేయాన్నయినా ఆలపించడానికి ...!

★★★

# నా హృదయంలోకి ప్రవేశించకు!

- లలిత చిట్టె



చిరునవ్వుల పువ్వులను విసురుతూ.
పలకరింపుల పన్నీరును జల్లుతూ..
మెల్లగా.. చల్లగా..
నా హృదయంలోకి ప్రవేశించకు!!
నా తపస్సును భగ్నం చేయకు!!
మూసుకున్న మది తలుపులను..
నీ ప్రేమతో తెరవాలని ప్రయత్నించకు!
నిశ్శబ్దం నిండుకున్న నా ప్రపంచంలో..
మౌనం తోడుగా నిలిచి... నను నడిపిస్తుండగా...
మధుర గానాలు ఆలపించి..
నన్ను మైమరపించకు!
వెన్నెల వెలుగులు నాపై క్రుమ్మరించి..
ఎదలోతుల్ని తడమకు!
చురుకైన చూపులతో నను వేధించి
వెచ్చని స్పర్శతో నను కలిగించకు!
కొనగోటితో తనువును మీటి..
నను కవ్వించకు!
ప్రియా!!
నువు ఆ.. ఆకాశంలో ఉంటేనే అందం!!
నేను అణువునై..
ఈ అవనిపై నిలిచి ఉంటేనే ఆనందం!!

★★★

# అద్వైతం

— భమిడిపాటి సౌభాగ్యనాగరాజారావు




నువ్వూనేనూ  ద్వైతానికి ప్రతిరూపాలం
మన మనసులు ఏకమైతే అద్వైతం అక్కడ ప్రత్యక్షమౌతుంది.
మన ఆలోచనలు కలిస్తే
అద్వైతం అక్కడ కొలువుంటుంది.
మనం ఒకరికొకరం అర్థమైతే
అద్వైతం అక్కడ ఆనందతాండవం చేస్తుంది.
ఒకే సంకల్పం మనిద్దరినీ స్పందిస్తే
అద్వైతం మనరూపాలలోనే స్థిరపడుతుంది.
ఆక్షణం నుండీ అద్వైతం, మనం
వేరుకాదు, ఒక్కటే  !!!!

★★★

# మనసు cabs

- రణీ సావేరి




మనస్సుదృ శ్య తెరల చాటు తేరుపై
ఉప్పొంగే హాలాహలపు అలలను దాటుకుంటూ
అమృతపు తీరాల వెతుకులాటలో
విప్పారిన కనురెప్పలమాటు వెలుగులలో
మనశ్శూన్యపు జ్ఞాపకాలను తడుముతూ
పసిపిల్లలవోలె
అటునిటు తూలిపోతూ,
తడబడడుగుల తలపులపరుగులతో
మనసు cabలో వేగంగా పయనిస్తూ
వర్తమానపు తలుపులు తలపులను మూసేసి
గతపు టచ్ స్క్రీన్లను రివైండ్ చేస్తూ
కేకలు, కినుకులు
కేరింతలూ, కౌగిలింతలూ
కోపాలు క్వొశ్చన్స్
ఎగోల్లోని ఇగోలను
హాస్యంలోని అహంకారాన్ని
అవహేళనలోని అవమానాన్ని
నెమరువేత వలలో వడిసిపట్టుకుని -
ఏరుకున్న
ఆణిముత్యపు క్షణాలను
క్షణికానందాలనితెలిసినా
నిమురుతూ నిగ్గుతీస్తూ
పట్టుకుంటూ పక్కకుతోస్తూ
అరుస్తూ అక్కునజేర్చుకుంటూ
వోదారుస్తూ వొదిగిపోతూ
ఇలా యెన్నో
మనస్సాక్షానుభూతులమధ్య
ఏడుపు నవ్వుల తూకాల త్రాసులో
బేరీజులుగట్టి
కనుగుడ్లపై తారసలాడే
ఒయాసిస్ మెరుపులను
కనురెప్పలమాటున కప్పెడుతూ
వోడుతూ గెలుస్తూ
మైండ్ తెరల వెనుక
కనిపించని బొమ్మలతో
చేసే యుద్ధాలకు
చరమం ఆన్ మై యెండ్ లోనేనేమో !!!!!

★★★

# నా మొబైల్‌ఫోనొక్క యోగి!

- వజ్జంశెట్టి పాండురంగ



తత్వమెరిగిన తాత్వికుడిలా
తామరాకుమీద నీటిబొట్టులా
ఓ యోగిలా తోస్తూ భయభక్తులు కలిగిస్తోంది
నిగనిగా మెరుస్తున్న నా మొబైల్ ఫోను!

కరిగే కాలంతో తరిమే మృత్యువుని చూపెడుతూ
ప్రమదమెరిగిన గస్తీకాపరిలా హెచ్చరిస్తూ
నిరంతరం నన్ను మేలుకొలుపుతుంటుంది
నా మొబైల్ ఫోను తనలోని గడియారంతో!!

నేలరాలుతున్న నా ఒక్కోపాత నేస్తం
పేరును కాంటాక్ట్స్ నుండి తొలిగిస్తున్నప్పుడు
నా చేతులెలా వణుకుతాయో దానికి తెలుసు!
ఐనా అదే మౌనం!!

మనసు కలసిన మరో కొత్త నేస్తం పేరు నమోదు
చేస్తున్నప్పుడు ఉద్వేగంతో నా హృదయమెలా
ఉప్పొంగుతుందో దానికి బాగా తెలుసు!!
ఐనా అదే నిర్లిప్తతా!!

భార్య భావకవిత్వంతో ఊరిస్తున్నా
బాస్ తిట్లదండకంతో బాధిస్తున్నా
స్పందనలేని దాని ఖనిజ స్వరపేటిక ఒకటే!

మనుమడు పుట్టాడన్న తీపివార్త
మానాన్న పోయాడన్న పిడుగువార్త
మోసుకొచ్చేదాని రింగుటోన్ ఒకటే!!

అనుక్షణం నాతోనే ఉంటూ
నా అణువణువూ తెలుసుకుంటూ
అర్థాంగికి కూడా పూర్తిగా అర్థంకాని
నా అంతరంగానికి నిలువుటద్దమై
కష్టసుఖాలకు, హృదయస్పందనలకు
సాక్షి భూతమై, నాలో నా అంతై
నిరంతరం నాతోనే ఉంటూ, జాలిలేని జడత్వంతో
నన్నేమాత్రం పట్టించుకోని నా మొబైల్ ఫోను
ఓ యోగిలా అనిపిస్తూ, భయభక్తులు కలిగిస్తోంది..!

★★★

# గుండె చెరువయ్యింది

– మధుసూదనరావు




గుండె చెరువయ్యిందంటే
ఎంత కష్టమొచ్చిందో అనుకుంటాం!
నిజమే – పనికిరానిదల్లా తోసేస్తూ..
పూజలందుకున్న 'అమ్మ'లనూ 'అయ్య'లనూ
పూలతో సహా పాడేస్తూ –
'ఊరి'న చెత్తనంతా ఊడ్చేస్తూ –
గుర్రం డెక్కల పచ్చని దుమ్ము పరచుకున్నా
ఈ ఊరునాది – ఈ చెరువు నాది అనుకోని
ఏ బిడ్డను చూసినా – ఏ 'తల్లి' గుండె మాత్రం చెరువు కాదు!
మనసు పెట్టి వింటే – ఆ గుండె గొలుసులుగా
కథల కదలికలతో కదిలిస్తుంది!
దగాపడ్డ 'గోస' పాట వినిపిస్తుంది!
ఎన్నో గొంతులను తడిపిన తడియారని స్మృతుల సంగతి చెప్తుంది!
అనుబంధాన్ని మరిచి, అనామికను చేసి
నీటి జాడ కోసం పరితపిస్తున్న బిడ్డను చూసి
ఏ తల్లి గుండె మాత్రం కడలికాదు!!
పండుగకీ, పాడెకీ, గుడికీ, జీవనరీతికి
చిరునామా – చెరువు!
గాలి మోటర్ల నుంచి చూస్తే చుక్కల్లా మిణుక్కుమంటోన్న
మన చెరువుల్లోకి పండుగలా దిగిరావాలి!
కాకతీయుల కాసారాలను గుండెకు హత్తుకోవాలి!! ★★★

# విహారి

– డా॥ కురుమేటి కిషోర కుమార్



ఆకాశవీథిలో మబ్బులతో దోబూచులాడుతూ
గాలిలో గిరిటీలు కొడుతూ
మెరుపులతో, ఉరుములతో సయ్యాటలాడుతూ
నెలరాజు వన్నెలు – చిన్నెలు వీక్షిస్తూ
త్రి సంధ్యలలో భానుడి ఆహార్యమ్ములు ఆనందిస్తూ
తారా తోరణాలలో దూరిపోదుమన్నట్లుగా,
ఉరుకులు – పరుగులతో తరలివెళతాము!

హంసలపిండు, కొంగలబారు, చిలకలదండు, పిట్టల, పావురాల గుంపు
గగనసీమలో ఎగురుతూ, వినువీథిలో.. అద్భుతకనువిందు
హరివిల్లు నుండి వదిలిన బాణంలా,
కడలి తరంగంలా, మెలికలు తిరిగే సర్పంలా,
మొగ్గలా, విరిసేపుష్పంలా, తీగలా, గీతలా సాగిపోతూ..
క్షణాల్లో రూపాంతరం చెంది, కనుమరుగయ్యే.. కామరూపులం

మార్గదర్శిగా ముందొకటి, వెనుకొకటి, ఒకదానినొకటి అనుసరిస్తూ.
శూన్యంలో స్వైరవిహారం చేస్తాం!
వాయుదిశను బట్టి, వాతావరణ స్థితులను పసిగట్టి
వంతులవారిగ, నేర్పుగా ముందుకు నడిచే విహంగములము..
'ఖగరాట్టులం '
గుంపులు, గుంపులుగా నింగిని ఎగిరే.. సంచారులం!

ఎండనక – వాననక, సముద్రాలైనా, ఎత్తైన పర్వతాలైనా
కీకారణ్యాలున్నా అలుపు – సొలుపెరుగక అవలీలగా దాటేస్తాం!
తూర్పుపడమర, ఉత్తరదక్షిణ దిశలన్నీ
పొట్టచేతబట్టి ఎగిరే 'ఆకస భిక్షుకులం'....ఆశాజీవులం
పెందలకడనేలేచి, పొద్దుగుంకకముందే గమ్యస్థానం చేరు.. వినువీథి
'బాటసారులం '
కమ్మని కలకూజిత కంఠస్వరనాదాలతో, రెక్కల చప్పుళ్ళ సంగీతం వింటూ
ఒకొరికొకరు తోడుగ ఉంటూ, వేనవేలమైళ్ళు పయనిస్తాం!
అల్లంత దూరాన్నుండి విహంగవీక్షణంతో ఆహారం పరికించి!
చప్పునవాలి, పంచుకుతింటాం!
ఎంతటి కష్టాన్నైనా సంఘటితముగ ఎదుర్కొని పోరాడు 'పులుగులం '
వేగం మా మంత్రం, గమ్యం మా సిద్ధాంతం
ఏపూట కాపూట పొట్టనింపుకు తిరిగే 'పదత్రులం'
చీకు చింతలేక జీవించు.. అల్పజీవులం
వినువీధుల్లో వేల్పులులా షికార్లు చేస్తూ
రెక్కలకష్టము నమ్ముకు ఎగిరే.. గాలిజీవులం!
విశ్వశాంతి దూతలం.. స్వేచ్ఛా 'విహారులం '!

★★★

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

హృదయమానంద వార్థియై యెగయుచుండె

ఆకసమ్మున తారలనంటుచుండె
ఇంత యానందమెన్నడేనెరుగలేదు
జరుపుకొననెంతునీ రోజ జన్మదినము

గడచిపోయిన కాలమ్ము గడచిపోయె
తెలియనిట్టి యుద్వేగమీ దినము వరకు
ఎల్లలెరుగని యానందమెడద నిండె
మనసు పరవశించెను జన్మదినము వోలె

ఈ దినమ్మడుగిడుదు నా యింట నీవు
హృదయమెల్లను నిండిపోయెదవు నీవు
తెలియు జీవితమన్ననీ దినము నుండె
అంతమయ్యెను గతము జన్మింతు నేడె

వెడలి పోయిన కాలమ్ము వేరు జన్మ
నూత్న జీవితమీ నాటి నుండి నాకు
నిండు కొత్తదనమిచట నేటి నుండి
జరుపుకొనబోదునీ రోజ జన్మదినము

జననమందిననుండి యీ దినము వరకు
కాలమొకరీతి తెలియక గడచి పోయె
ఎదను నూతనత్నమ్ముదయించె నేడు
నవ్య జీవితాంకమునకు నాంది యిద్ది



చిత్రం:కె.రామ్మోహన్

**చిత్రాలు: వజ్రంశెట్టి పాండురంగ**




నీ కలం లోని
మధువుని త్రాగిన అక్షరభ్రమరాలు
ఆనంద నాట్యం చేస్తాయనుకుంటే పొరపాటే
అవి
కర్తవ్యం తెలిసిన ఆయుధాలై
నిన్నావహిస్తాయి!
బాధాగర్భం నుండి ప్రభవించిన
ప్రతి ఆకలి కేకా ఓ కవితా రేఖయి
నిన్ను కార్యోన్ముఖున్ని చేస్తుంది!
నిన్న మొన్నటి
అలంకారప్రాయపు కలం
అక్షయతూణీరమై
రూపాంతరం చెందినపుడు
అక్షర శరాలను సంధించక పోతే
గాండీవమున్నా.........
బృహన్నలవే సుమా!!!

***




కాలమా! కాలమా!
వేళ్ళ సందుల్లో నుండి
జారిపోతున్న పాదరసమా!
ఇసుక తిన్నల్లో
ఇంకి పోతున్న జలపాతమా!
నిన్ను పట్టుకోలేని
ఈ ప్రయత్నంలో
నిన్ను దరి చేరలేని
ఈ ప్రయాణంలో

అలసిపోయి విసిగిపోయాను
విసిగిపోయి అలజడి చెందాను!
చిన్నప్పటి పసి రోజుల్లో
ఎదగాలనే ఎదురుచూపుల్లో
సరదాల సంబరాలలో
చక చకమని పరిగెత్తావు!
బాధ్యతల బరువుమోతల్లో
పగలు రాత్రి పరుగు పందెంలో
ఊపిరి పీల్చుకునే క్షణం లేదంటే
ఊరుకోమని నవ్వావు
నీకా మాత్రం చాతకాదాని ఉడికించావు!

ఉల్లాసంగా ఉంటే పరిగెడతావు
నిరాశగా ఉంటే కదలక మొరాయిస్తావు
ఉండమంటే వెళతానంటావు
వెళ్ళమంటే నసుగుతావు
ఆగమంటే పరిగెడతావు
పరిగెత్తమంటే కుంటుతావు!
బావిలోకి ఇంకాస్త తొంగి చూస్తే
ఇంకేముంది?
వరదలా వయసు ముంచుకొస్తుంది,
ముసిరిన ముసలితనంలో
పారిపోయిన బంధాల అన్వేషణలో
నా ఏకాంతానికి స్నేహానివై
రోజులు లాగదీస్తావు
నన్ను ఏడిపిస్తావు!
నువ్వు అర్థం కాని ఒక వింతవి
జవాబు దొరకని తిక్క ప్రశ్నవి!
ఎటు చూసి ఏం చేసినా
నువ్వే కదా ఈ కథలోని 'విలను '
అది మాత్రం బల్ల గుద్ది చెప్పగలను
మా రొదల సొదలు నీకు పరిహాసం
ఈ కలతల కవితలు నీకు వేళాకోళం
చెవిటి వాడి ముందు ఊదిన శంఖారావం

ఇలా అన్నానని కించపడకు నేస్తం
నాకెప్పుడూ కావాలి నీ చల్లని హస్తం
తెలుసు నాకు ఈ కథకు
మొదలు అంతం నువ్వేనని
అందుకనే విన్నపం
ఓ అందమైన ముగింపునివ్వమని.......

★★★




నీ తలపు చాలు
తరగని గతాన్ని తరిమివేయటానికి
జరగని కాలాన్ని పరుగులెత్తించటానికి
నీ పిలుపు చాలు
అలపు సొలపులను తొలగించటానికి
గెలుపు బాటలో నడిపించటానికి
నీ చూపు చాలు
కోపతాపాలు కరిగించటానికి
రేపు మాపులు దీపించటానికి
నీ నవ్వు చాలు
నిరాశాదవ్వులు దాటించటానికి
దిలాసా పువ్వులు పూయించటానికి
నువ్వు చాలు
జీవనం ఆనందవమవటానికి
జవ్వనం సుగంధ సుమమవటానికి!!!

★★★




ఇక్కడ ఉల్లాసంగా నినదించే
ఓ కోయిల పాటలేదు.
వెలుగు పరిచే ఆకసము కానరాదు.
ఒక్క సెలయేరైనా పాడుతున్న సవ్వడి లేదు.
యుగాల తరబడిగా, చీకటిగా,
ముళ్ళబాటల సొరంగమై,
క్రూరంగా, మోహంగా,
ఆశై పెరిగిన ఆకలితో ఈ అడవి!?
గమనించావా?
అహంకారంతో పెంచిన అసురత్వపు కవచాన్ని
పూర్తిగా తొలిగిద్దామా?
తిమిరంతో మూసుకుపోతున్న కళ్ళు తెరుద్దామా?
సంకల్పితంగానే పెంచిన ఈ చీకటి కప్పును
యే జ్వాలా ఖడ్గంతో చీల్చాలో చూద్దామా?
మనుషులు మధ్య కురవాల్సిన వెన్నెల జల్లును
కొంచెంగా నైనా కురిపించేందుకు యత్నిద్దామా?
అడవిని సృష్టించింది మనమే గదా!
అంధకారాన్ని చీల్చాల్సిందీ మనమే!!

***




విడిపోయాం ! నిజమే !
మళ్ళీ కలిసే ప్రసక్తే లేదు ! అదీ నిజమే !
అయితేనేం?
మనం స్నేహించిన కాలం లో
జీవించాం..గుర్తుందా ?
మనం కలిసున్న కాలం ఎంతో కొంత ఉంది కదా !
గంటలో ...రోజులో....నెలలో ... !
నెయ్యంతో పంచుకున్న ఊహలు, ఊసులు
పగల బడి నవ్వుకున్న నిమిషాలు...
మనసు నలిగినప్పుడు ఓదార్చుకున్న క్షణాలు
నేనే నువ్వన్నట్టు, నువ్వే నేనన్నట్టు
ఒకరి నొకరు సహానుభూతించిన సందర్భాలు
మౌనంగా  పక్క పక్కన కూచున్న ఏకాంతాలు
నా మనో మందిరంలో అందాల చిత్రాలు
అమృతం లాంటి మన సాంగత్యాన్ని
గరళం లాంటి  నీ నిష్క్రమణాన్ని
నా మనసు హంస లా వేరు చేస్తుంది
నాటి అద్భుత ఘడియల్ని నెమరేస్తుంది
జ్ఞాపకాల పరిమళాల్ని ఆస్వాదిస్తుంది
కాల కూటం లాంటి నిర్గమనాన్ని త్యజిస్తుంది
చర్విత చర్వణాల పై ఆసక్తి లేదు
కా లం చేసిన గాయాలపై అచ్చెరువూ లేదు
నిందా, నిష్ఠూరాలపై అక్కర అసలే లేదు
అంతర్లోకంలో ఆ నాటి స్మృతులు నిక్షిప్త నిధులు
ఆజన్మాంతం గుండె గదిలో  అత్యంత పదిలాలు

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

వీడదే చిరునవ్వు నా పెదవి వీడి
అనుదినము మోముపై కదలాడుచుండు
అందజాలగలేని యానందమిట్లు
నా మనస్సును నిండె జన్మము తరించె

వేరు యోచనలవి యన్ని వెనుకకేగె
తెలియజాలని వింత నిశ్చలత నిండె
ఇంత యానందమెన్నడేనెరుగనైతి
చెలియ! పంచుకొనుమిది నా చెంతజేరి

సంతసమ్మున కలుగు హృత్సంభ్రమమ్ము
ఎడద యానందమున పర్వులెత్తుచుండు
గుండె యుద్వేగమున కొట్టుకొనుచునుండు
ఇవి యెరుంగని ముదము నేడెదను నిండె

ఈ ప్రశాంతతకు విలువనెవడు కట్టు
ఈ ప్రమోదమునకిల సాటేమి యగును
కాలమెంతైననీ స్థితి కరగిపోవు
కలసి యుందుమిట్లెన్ని యుగమ్ములైన

ఎంతగా మింటికెగసిపోయినను గాని
గుండెలవిసెడు హ్లాదమ్ము కొంత వరకె
నిశ్చలమ్మై హృదయమెల్ల నిండునట్టి
నిర్మలానందమెప్పుడు నిత్యమగును



చిత్రం:కె.రామ్మోహన్

చిత్రాలు: వజ్రంశెట్టి పాండురంగ

శ్రీ మన్మథ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
20 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కవిత విభాగంలో బహుమతి పొందిన కవితలు

# పులస చేప స్వగతం

- శిఖామణి



నా పేరు పులస
నా ఊరు కోస్తాంధ్ర
నా తల్లి గోదావరి
పువ్వుల్లో పారిజాతంలా
జలపుష్పాల్లో మేటి పుష్పాన్ని
నా పేరు పులస
పర్వతాల్లో హిమాల్లయంలా
చేపల్లో రారాజును
నా రాజ్యం నోరూరించే షడ్రుచుల సరోవరం
నా సారం రససిద్ధాంతాని కెక్కని దశమ రసం
అందానికి నిండు చందమామను
నా ఒంటి మీద మిలమిలల పొలుసులు
తళతళలాడే వెండి రూపాయి బిళ్ళలు
అందగత్తెల కళ్ళకు ఆకృతినీ
వెయ్యేనుగుల బలంలాంటి
అయస్కాంతపు రజను అద్దిన దాన్ని
బతుకు సముద్రంలో మీరు ఎన్ని మునకలేసారో
ఆటుపోట్లలో ఎన్ని ఎదురీతలు ఈదారో నాకు
తెలియదు కానీ
నా బతుకంతా ఎదురీతే
ఉరకలెత్తే వరదగోదావరి
సముద్రంలో కలిసే సంగమ స్థలి
నా పోరాట రణస్థలి

చాలామంది నాలో 'అమ్మో ముల్లులెక్కువా' అంటారు.
మీశరీరంలో ఎముకలున్నట్లు నా ఒంట్లో ముల్లులుంటే
తప్పేంటి
అయినా మీ మనసుల్లో ఉన్న
వివక్షల విద్వేషపు ముళ్ళ కంటే
నా ముళ్ళేం ప్రమాదకరం కాదు.
ఎప్పుడైన సన్నని నూలుదారం లాంటి
ఏ పొట్ట ముళ్ళో గొంతుకు అడ్డం పడితే
గుప్పెడు తెల్లన్నం ముద్దచేసుకుని అమాంతం
మింగేయండి
ముద్దతో పాటు ముళ్ళూ
గుట్టు చప్పుడు కాకుండా గొంతులోకి జారిపోతుంది.
పులుసు ఉడుకుతున్నప్పుడు కాసిన్ని
లేత బెండకాయల్ని వేయడం మరిచిపోకండి - ఆ రుచే
వేరు
అప్పుడే వార్చుదించిన పొగలు గక్కుతున్న వేడన్నంలో
ఇంత పులుసు కలిపి
రెండు ముద్దలు తిన్నారంటే చాలు
ఆ రుచి ముందు అమృతం దిగదిడుపే!
ఇంట్లో ఎన్నిరకాల వంటపాత్రలున్నా
నన్ను మాత్రం మట్టి దాక వండటం మర్చిపోవద్దు
ఎన్ని రకాలు పొయ్యిలున్నా
మట్టి పొయ్యి మీద కట్టెలతో వండి చూడండి
దాని రుచే వేరు!
అదీ రాత్రి వండిన కూర పొద్దున తిని చూడండి
ఈ జీవితానికి ఇంకేం వద్దనుకుంటారు.
లే లేత ఎండపొడకు కరిగిపోయే వెన్నపూసలాంటి
నా చెన ఒకసారి నాలుక మీద చప్పరిస్తే
మళ్ళీ మళ్ళీ మానవ జన్మనే కోరుకుంటారు.
నెలలు నిండినా కాన్పు రాని వాడ కోడలికి
పులసలొచ్చాయట అన్నమాట చెవిన పడితే గాని
పురిటి నొప్పులు మొదలవ్వలేదు.
రాత్రికి వేడి వేడి పులసకూర పులుసుతో అన్నం తిని
తెల్లార గట్ల దబ్బపండు లాంటి మగబిడ్డకు జన్మనిచ్చింది
డబ్బున్న మారాజులు ఎంత ధర పలికించినా
నన్నెగరేసుకుపోతే
కూలీ నాలీ చేసుకునే బీదా బిక్కి
బక్కచిక్కన చేపనెంచుకుని
నలుగురు నాలుగు పోగుల వాటాకు వస్తారు.
చిన్ని కృష్ణుడు రేపల్లెలో పుట్టాడు కాబట్టి
పెరుగన్నంలో ఊరగాయ నంజుకున్నాడు గాని
ఈ ప్రాంతంలో పుట్టి ఉంటే నా చేపల పులుసు
పెట్టమని వాళ్ళమ్మని మారాం చేసేవాడు.

ఇత్తడికీ పుత్తడికీ తేడా తెలియని అమాయకులకు
మా వాళ్ళే పులసలని చెప్పి
ఇలస చేపలను అంటగడతారు
కానీ పులుసు దగ్గర దాని రంగూ ఇట్టే బయట
పడిపోతుంది.
అంతెందుకు దేవతలే దిగి వచ్చి ఒకచేత
అమృతభాండం
మరొక చేత పులస చేపకూర చట్టిని పట్టుకుని
ఏది కావాలో కోరుకోమంటే కూర చట్టినే కోరతారు
ఈ జిల్లాల భోగ జనులు.
చివరికి ఒకమాట చెప్పాలి
పుస్తెలు అమ్మి అయినా పులస కూర తినాలని
గోదావరి జిల్లాల సామెత
ఈసారి గోదావరికి వరద వచ్చినప్పుడు
మీకు కబురెడతాను
మా జిల్లాలకొచ్చి నా పులుసుకూర
ఇంత రుచి చూసి పొండి.
ఇకపై మీ జిహ్వ మా గోదారొడ్డునే
మొప్ప పిల్లై ఈదులాడుతుంది.
నా జీవితం అంతమై పోతుందన్న బాధకంటే
లక్షలాది జనుల రాసిక్యపు నోళ్ళలో
ఒక్క లాలాజల బిందువువైనందుకు సంతోషిస్తాను.

***




అలాగే  ఎదురు చూస్తుంటాను..
తల ఎత్తుతూనే కూలిపోయే నా అసమర్థతని చూసి
పెదవి విరిచేవారిలో ఒక్కరైనా
నేనందుకోవాలనే ఆకాశం కేసి
ఒక్కసారి  తల ఎత్తి చూస్తారేమోనని..

తీరాన్ని తాకుతూనే కుంచించుకుని విరిగి కలిగిపోయే
నా పిరికితనాన్ని పరిహసించే వారిలో ఒక్కరైనా
శిఖరాగ్రాల మీదనుంచి లోయల్లోకి దూకిన
నాటి నా సాహసాన్ని గుర్తు తెచ్చుకుంటారేమోనని..

నిరంతర నిరర్థక ఘోషతో
నిస్సారంగా వెల వెల బోయే
నా తీరాల నిర్జీవతని చూసి
నన్ను వెలివేసేవారిలో ఒక్కరైనా
నేనడిచి వచ్చిన పథానికిరుపక్కలా వెల్లి విరిసిన
పచ్చదనాన్ని ఒక్కసారి తలచుకుంటారేమోనని..

చేజారిన కొవ్వొత్తి దగ్ధం చేసిన నా కుటీరపు ప్రాంగణానికి
కుతూహలంగా చేరి
నా అజాగ్రత్తను ఆరోపించేవారిలో ఒక్కరైనా
నేను తొలగించబోయిన చీకటిని గుర్తించి
మౌనంగా వెనుతిరిగి పోతారేమోనని..

శ్రావ్యంగా సాగిన నా విషాద గీతిక ఆగిపోకముందే
సభల్ని మారుమోగించే కరతాళ ధ్వనుల్లోంచి
తెగిపోయిన  నా హృదయ తంత్రులని వెదుక్కుంటూ
ఒక్క నిశ్శబ్దప్రశ్న నా కళ్ళను సూటిగా తాకుతుందేమోనని..

తప్పనిసరి బ్రతుకుతెరువు సంతలో
స్వయ విక్రయంకోసం
నా తగరపు కిరీటానికి తగిలించుకునే
మిణుగురుల్ని చూసి
ఎగతాళి చేసేవారిలో ఒక్కరైనా
నేను ఓడిపోయినది ఏ ముత్యాల వేటలోనో
అర్థం చేసుకుంటారని...

క్షణానికో రంగు మార్చే నా భంగిమల్ని చూసి
వికవిక నవ్వేవారిలో ఒక్కరైనా
నేను శాశ్వతంగా కోల్పోయింది ఏ స్వేతహాసమో
చేరదీసి  తెలుసుకుంటారేమోనని..

రక్తసిక్తమైన నా పద ద్వయానికి
శైత్యోపచారాలు చేయడానికి
నా చుట్టూ చేరే దయావయుల్లో ఒక్కరైనా
నేనడిచి వచ్చిన బాటమీది ముళ్ళని
ఏరివేయడానికి సాహసిస్తారేమోనని...
.... .....
గళాన్ని అలంకరించే కుసుమ మాలలు
ఎదలోని శిశిరాన్ని చిగురింపజేయవనీ తెలుసు!
కాశ్మీర శాలువల చిరు వెచ్చని మృదుస్పర్శ
కృంగిపోయిన భుజాలను పొంగించలేదనీ  తెలుసు!
రాసిన ప్రతిసారీ అనుకుంటాను
ఇదే ఆఖరి కవిత అని...

***




పర్వతం ఉనికి తెలిసిన
కోట్ల ఏళ్ళ కు
పరమాణువే ప్రాథమికమని తెలిసి
ఎన్నెన్ని ఆశ్చర్య ఆవిష్కరణలు
చేయిస్తోందో చూడు.

సదా భూమి కై
రాలి పడే చెట్టు ఫలం
న్యూటన్ లో మాత్రం
గురుత్వాకర్షణ కు ప్రాణం పోసి
అంతరిక్షాని కే వంతెనలు వేసింది చూడు.

పరమాణువంత నలుసైనా
పర్వతమంత పెద్దైనా
నిజ రూపం దాల్చే క్రమంలో
ఊహ
పరాక్రమం ప్రదర్శిస్తూనే ఉంది !

అందుకే ఊహించు
కల లాగా
కల నిజమయ్యే లాగా
ఊహించు

ఊహించడానికేం ఖర్చు కాదులే!

కేంద్రక విచ్ఛిత్తిని
కేంద్రక సంలీనాన్ని
ఊహించి
సూర్యుని శక్తియుక్తులుగా నిరూపించి
పెను విస్ఫోటనాలకు
మారణ హోమాలకూ
తెర తీసిన చరిత్ర.....
ఇప్పుడు
విద్యుచ్ఛక్తికి
శాంతి ప్రయోజనాలకూ
బాటలు
వేస్తున్నది కదా!

అందుకే ఊహించు
వినాశాన్ని దారి మళ్ళించి
శాంతి కాంతులు దానికి చూపేందుకైనా
ఊహించు

ఊహించడానికేం ఖర్చు కాదులే!

ఊహించే కదా
విధ్వంశకులు
ఆకాశ సౌధాలను
విమానాలతో ఢీకొట్టారు!
ఊహించే కదా
హిరోషిమా నాగసాకియాలలో
అణుబాంబుల చెలగాటమాడారు!

ఊహలు
మరింక ఏ విధ్వంసాలకూ
ఒడిగట్టకుండా నిలువరించేందుకైనా
ఊహించు

ఊహించడానికేం ఖర్చు కాదులే!

చక్కెర వ్యాధి లోని చక్కెరను
ఎక్కువ నీళ్ళు పోసి కలిగించి కడిగేసినట్టు
ఊహించు!
పెట్రోలుకు బదులు
నీరే బండిని నడిపిస్తున్నట్టు ఊహించు!
ఉప్పు సముద్రాన్ని
క్షీరసాగరం గానో కొబ్బరి నీళ్ళ కోనేరు లానో
మారుస్తున్నట్టు ఊహించు!
క్యాన్సర్ కంతులను పెరికేసి
'మరి ఇక వ్యాపించకు ' అని శపించినట్టూ
ఎయిడ్స్ నూ ఎబోలానూ
బొద్దింకల మందు తో బోర్లా కొట్టి పంపించి
పరాచికాలాడి నట్టు ఊహించు!

రగిలే సమస్యకు సమాధాన గనిలా
పులికొల్పేలా పనికొచ్చేలా
ఎలాగైనా ఊహించు
ఊహించకుండా ఉండటాన్ని తప్ప
దేనినైనా ఊహించు

ఊహలను నిజం చేయలేకపోతే చింతించక
వివరాలన్నీ మూటగట్టి
తరువాతి వారకు అందించేందుకైనా
ఊహించు
ఊహించడానికేం ఖర్చు కాదులే!

*****




చెరువంటే
వందల తరాల తాళపత్ర గ్రంథం
వేల యేళ్ళుగా పరిమళిస్తున్న తడి గంధం
చెరువంటే -
నా తెలంగాణా తల్లి
ఈ నేలమీద నాటిన నీటి చుక్కల మొక్కలే కదా
ఈ మట్టిమీద పండించిన వడ్ల గింజలే కదా
కరువుకే కరువు తెప్పించిన కల్పవల్లులు కదా
ఊరి వాకిట్లో పేర్చిన నీటి బతుకమ్మలు కదా

★ ★

చెరువు సముద్రమంత నడకలు నేర్చింది కాకపోవచ్చు
నదంత నాగరికతతో ప్రవహించక పోయి ఉండొచ్చు
కానీ ,అది ఆకాశమంత విశాలం -అగాధమంత
ఉన్నతం
తలవంచని మేరు కిరీటం -తల ఎత్తిన సాగర కెరటం

తడబడినప్పుడు వెన్ను తడుతూ
పోరబడినప్పుడు పాదాల్ని నిలబెడుతూ
మన కంట్లో నలుసు పడితే తన ఒంట్లో నీరు చిమ్ముతూ
యుగాల నుండి మనకు
మెతుకు రుచిని గుండె నిండా నింపింది
బతుకు జాడని ఊరంతా ఓంపింది

ఇప్పుడు చెరువు -
మ్యూ జియం లో  బొమ్మై పోయింది
గూగుల్ సెర్చ్ లో నాట్ ఫౌండ్ గా ప్రత్యక్షమయ్యింది
చెరుకు గడలకే తీపిదన్నాన్నిచ్చిన మా బెల్లాల్  చెరువు
మచ్చుకైనా లేకుండా పోయింది
పచ్చని పైరు పంటలను ఈ మట్టిమీద అల్లిన అల్లిసాగర్
జాగ్రఫికల్ చిరునామాను  వెతుక్కుంటుంది
ఆడ బిడ్డలందరి పాదాలకి పసుపు రాసిన పసుపాగు
బురద గుంటై బేజారై పోయింది
జనాలందరికీ జావకాసి పోసిన జానకంపేట చెరువు
జావగారి పోయి జాడలేకుండా పోయింది

గంగాళం లా పొంగి పొర్లిన చెరువు
ఇప్పుడు తంబాలం లా మారింది
ఆరు దశాబ్దాల అన్యాయాల ఫలమిది
ఆరు కాలాల అరణ్య గోస యిది
వెంటి లెటర్ లపై మూలుగు తున్న చెరువులకి
ఇక కొత్త అక్సిజెన్ ఇవ్వాలి
సేద్య సంభాషణలో మూగ పోయిన చెరువులకి
ఇక రీఛార్జి చేయాలి

నిధులొద్దు -నీతులొద్దు
నిక్షేపాలొద్దు -అక్షేపనలొద్దు
మనకు నీళ్ళు కావాలి
మన మనుగడకు ఆనవాళ్ళు కావాలి
చెరువు -
శత వసంతాల తల్లిదీవెన
చెరువు చేరువ రామకోటి కీర్తన
చెరువు మనందరి కళల కాణాచి
రేపటి కలల తివాచి
చెరువు అంటేనే పల్లేసీమ
చెరువే ఊరికి ఊపిరితిత్తి
పల్లెకి పట్టెడన్నం పెట్టె దొనకర్ని
చెరువును బతికించటం అంటే
ఊరికి ఊపిరి ఊదినట్టే
జనానికి జీవగంజి  పోసినట్టే

ఓయి మానవా !మహర్షి !మరయంత్రమా !మనో
మృగమా !
తరాలనుండి మనందరికీ జన్మనిచ్చిన చెరువు
ఇప్పుడు పునర్ జన్మ కోసం ఎదురు చూస్తుంది
ఆదిమ క్షణాల నుండి మనకు స్థిర జీవనాన్నిఇచ్చిన
చెరువు
ఇప్పుడు కాసింత స్థలం కోసం నీ వంక చూస్తోంది

చెరువు ఇప్పుడు ఓ ఖాళీ నీటి ముల్లె
దాని ముడులు విప్పి నీటి ధాన్యాన్ని నింపాలి
చెరువు మన అవ్వ తాతల బోషానం పెట్టె
దాని తుప్పుని తీసి జల నిధులను నింపాలి
చెరువు మన సమిష్టి వృక్షం
చేయి చేయి కలిపి అలల నీటి కొమ్మల్ని చెక్కాలి

చెరువు -
మార్గ మధ్యంలో మనం వదిలేసిన మన కన్నతల్లి
శరణు వేడి తిరిగి మన ఇంటికి తెచ్చుకోవాలి

***

**చిత్రాలు: వజ్రంశెట్టి పాండురంగ**




**వరం పొందిన** రాక్షసుణ్ణి పాత సినిమాల్లో చూసినా...ఇంకా పాతవి -
సినిమాల్లాంటి పురాణాల్లో చదివినా...
అభిమానాన్ని ఉడకబెడితే వొచ్చే ఆవిరొకటి కమ్మేస్తుంది మనసుని.
కొంచెం అర్ధమయ్యేట్టు చెప్పాలంటే soft corner అన్న మాట.
ఎలాగైనా వాణ్ణి మార్చాలన్న ఆలోచన ఒకటి వచ్చి 'వద్దురా' అని
ఎవ్వరు చెప్పినా వినకుండా వెంటనే వాడితో దోస్తీ కట్టేస్తాను.
మా సావాసం చిక్కబడకముందే వాడు పట్టుబడిపోతాడు...
సినిమా హీరోనో..దేవుడో ఒక్కసారిగా ప్రత్యక్షమై
నా కళ్ళ ముందే నిర్దాక్షణ్యంగా చంపేస్తాడు ఆ-సురుణ్ణి.
వాడి చావుతో మార్మోగిన ప్రేక్షకుల చప్పట్లు..నా కనురెప్పల చప్పుళ్ళు...
మొత్తం మంచే జరిగిందని నన్ను నమ్మించేస్తాయి.
నేను నమ్మేసి...ఆ నమ్మకంతోనే భోంచేసి కునుకేస్తాను.
కానీ...అంత మంచి 'వరం' waste అయ్యిందన్న కలవరపాటు
కొన్ని రాత్రుల పాటు...
నా కలలకు గస్తీ కాస్తూనే ఉంటుంది !
నా మనసు చేసే రాక్షస ప్రయత్నం నన్ను ఇంకో రాక్షసుడికి
పరిచయం చేసే వరకు.
నొప్పి లేకుండా నిర్ణయాలు తీసుకున్న మనసులే...
తర్వాత కానుపు కష్టాలు పడతాయి.

అలా అని తెలిసి తెలిసీ మనసును తీసుకెళ్ళి
ధ్వంసం కావడానికి సిద్ధంగా ఉన్న విమానమెక్కించలేంలే !!
పొరపాటున పరధ్యాన్నంలోనైనా ఎక్కించామా...
.దక్కించుకోవడానికి రెక్కలు అలిసేలా ఎగరాలి.
అందిన దానికీ ఆశ పడ్డదానికీ మధ్య ఉన్నది అంతరాయమే అయితే
దూరదర్శన్ లాంటి ఏదో ఒక శక్తి కరుణిస్తుంది.
మరి అగాధమయితే ??
ఎన్ని ట్రక్కుల ఎర్ర మట్టి కావాలి!
ఆ నల్లటి శూన్యానికి రంగేసి
వంతెన నిర్మాణానికంటూ ఒక వీలును కల్పించటానికి ?
అంత దారుణమయిన అగాధాలు ఉంటాయా అంటే ...ఉంటాయి.
తనకి పాయసం ఇష్టం...నాకు పాయా సూప్ ఇష్టం.
తనకి నిలవడం ఇష్టం...నాకు నడవడం ఇష్టం.
తనకి తుంపరలు ఇష్టం...నాకు తుఫానులు ఇష్టం.
ఇప్పుడు తన సంగతి అనవసరం గానీ...చెప్తున్నానంతే !
కిందా మీదా పడినా మనసు పడిన ఇష్టాలన్నీ సత్యాలే..
.సత్యాలంటే నగ్నత్వాలు.
కానీ దేనికదే ప్రత్యేకం...అందుకే ఇంత వ్యత్యాసం.
నగ్నంగా ఉన్నందువల్లే ప్రేమ పుడుతుంది.
ఆ నగ్నత్వాన్ని జీవితాంతం ఆరాధించలేకపోవడం వల్లే వెగటు
పుడుతుంది.
ఇది గ్రహించకుండా మనసులు ఒక్కటయ్యాయనే కలివేపాకు
విషయాన్ని
రోట్లో వేసి ఎంత నూరితే మాత్రం ఏం ప్రయోజనం?
అయినా మా టైలరు సుందరం అన్నట్టు...
వెతికినా నువు కావాలనుకున్నది అట్టే దొరకదు..
.దొరికినా నీ కొలతలకు తగినట్టు కుట్టించుకోవాలి.
ఏది ఏమైనా...ఏమిటో కదా మనసు చేసే ఈ అన్వేషణ.
బట్టలేసుకోకుండా !
Naked Child మళ్లే ! ★★★




**ఎంత చిత్రమైనది**
ప్రేమ అనే భాషకు
పొంగిపోతుంది
ఆ ప్రేమ దక్కాలని
ఎదురు చూస్తుంది
అదే ప్రేమ కోసం
హద్దులు అర్హత మరచి
ఆకాశానికి నిచ్చెన వేస్తుంది
తన సుఖం మరచైనా
తన వారి సుఖం కోరుతుంది
ఏ త్యాగమైనా
ఇష్టంగా చేస్తుంది!
ఆ ప్రేమ మురిపెంలో
చిన్న పిల్లాడిలా కేరింతలు కొడుతుంది
ప్రేమ ఎంత ముచ్చటైన భావన
హద్దులు మరచి
నింగిని చేరాలని ఉబలాట పడుతుంది
నిజము కనపడక
ఒంటి చేతి చప్పట్ల సవ్వడికే మురిసిపోతుంది
అదే ప్రేమ
ఎంత చిత్రమైనది
తన అవసరం ఇక లేదని తెలిసినా
తానొంటరి అని తెలిసినా
తన భావం పరిణతి శూన్యమని ఎరిగినా
అక్కడ ఒంటరిగా
ఏ తోడూ లేకున్నా
పంచిన...
పెంచుకున్న ప్రేమకు
ద్వేషం కోపం తెలియక
తన ఉనికే ఒక ప్రశ్నైతే
తన ఆలోచనల ఊహల తోడుగా
గోడు పంచుకునేతోడు కరువై
ఆ ఎడారి దారిలో
ప్రేమ అనే ఒయాసిస్సు ని అన్వేషించే వేళ

ఈ ఒంటరి స్థితికి
నీవే కారణమని
వేలెత్తి దెప్పితే
ప్రేమంత ప్రేమకె
ప్రేమ మీద జాలిపుట్టి
ఏడ్వాలని కంటి పాప నడిగినప్పుడు
తమ విలువ లేని చోట నిలువలేమన్నప్పుడు

బాధ తీరే దారిలేక
వేదన రోదనైతే,
అక్కడ మనసు
ఎంత చిత్రమైనది
ఆ బాధను కూడా తానే అనుభవిస్తుంది
ఒంటరిగానే రోదిస్తుంది
తన వారి సుఖమే కోరుకుంటుంది. ★★★




**జ్ఞాపకాల దొంతర్లని** దులిపి దులిపి వెతుకుతున్నాను
నిర్భయంగా నిజాన్ని పలికిన నా గళాన్ని
సగర్వంగా తలెత్తి తిరిగిన నా అహాన్ని
మంచి చెడులు తెలిసి నడిచిన నా వ్యక్తిత్వాన్ని
స్నేహం విలువ తెలిసిన నాలోని ఆ స్నేహితురాలిని -
ఎక్కడో... ఉండాలి
వీధిలో ఆటలాడిన రోజుల్లో
పోటీపడి పబ్లిక్ పరీక్షలు రాసిన రోజుల్లో
కాలేజీలో కుర్రకారు బీటేసిన రోజుల్లో
పగలు రేయి ఉద్యోగాల వేటలో మునిగిన రోజుల్లో -
చూసిన జ్ఞాపకం
పెళ్ళిచూపుల్లో సిగ్గుపడి తల వంచినపుడో
కొంగుముడి వేసుకుని తలంబ్రాల బరువుకి తల
దించినపుడో
కన్నపేగు కదిలి కడుపు తీపికి లొంగినపుడో
ఇల్లాలిగా ఇంటిపనుల్లో మునిగి పోయినపుడో -
ఎక్కడో మరుగున పడిపోయి ఉంటుంది
ఎందుకంటే, అంతకు ముందు చూసిన జ్ఞాపకం
మరుగున దాగిన పుటల్ని తడిమి తడిమి వెతుకుతున్నాను
ఇంకా వెతుకుతూనే ఉన్నాను
ఆ కనిపించని నాలోని 'నా' కోసం !

***




వారిని చూశక వారి విషాదగాథలు విన్నాక
దృశ్యాలు దృశ్యాలుగా వారి బతుకుచిత్రాలు
నాకళ్ళముందు చెట్టుకొమ్మల్లా తెగిపడుతుంటే
ఆ అదృశ్య గ్లోబల్ గొడ్డలి గురించే ఆలోచిస్తున్నా
ఒక మెరుపు లాంటి ఆలోచన
ఒకఉరుము లాంటి భావావేశం
హృదయాకాశాన్ని బద్దలుకొట్టుకుని
నీలికళ్ళమేఘాల కొసలనుంచి
కన్నీటికవిత్వమై వర్షిస్తోంది
పండువెన్నెల మైదానాల్లో ఎగిరి గంతులేసిన బాల్యం
పట్టణ శివారులో ఫ్యాక్టరీల పొగగొట్టాలకింద
మసకబారి పోయిందని వారు వాపోయాక
మల్లెపందిరి తీగల్లా మెట్టినిల్లకు అల్లుకుపోయి
రేపటిపొరులకు ప్రేమపరిమళాలు పంచాల్సిన యువతులు
పేదరికం వలలోచిక్కి వ్యభిచారగృహాల్లో చేపల్లా
విలవిలతున్నారని వారుకన్నీటిభాషలో చెప్పాక

కొండల్లో కోనల్లో పచ్చిక మైదానాల్లో
స్వేచ్ఛగా తిరుగాడిన ఆదివాసీలు
అడవులకు నిప్పంటించి భూములు ఆక్రమించిన
కొయ్యగుర్రాల కార్పొరేట్ కంపెనీళ్ళో
కూలీలుగా మారిపోయారన్నవాస్తవం విన్నాక
దేహాలనే యంత్రాలుగా మార్చుకుని
పోడుభూములను పంటభూములుగా మార్చి
దేశానికి అన్నంపెట్టిన రైతన్నలు
సెజ్ ల మహమ్మారికి భయపడి ఉన్నభూముల్ని వదిలేసి
పొట్టకూటికోసం పట్టణాలకు వలసెళ్లిపోయారని తెలిశాక
పెద్దచేపలు చిన్న చేపల్ని మింగేసినట్టు
హ్యాండ్ లూమ్ లను మరమగ్గాలు...
కులవృత్తులను కార్పొరేట్ కంపెనీలు
చిన్నిచిన్నివ్యాపారాలను గద్దలషాపింగ్ మాల్స్ మింగేస్తే
చెప్పులుకుట్టే చంద్రన్ననగలశిల్పినాగయ్య
పరుపులుఏకే మస్తానయ్య తడకలుఅల్లే తిప్పయ్య
పూసలు అమ్ముకునే పూలమ్మలాంటి ఎందరో
ఎన్నో కుటుంబాలు ఉపాధిలేక అదృశ్యమైపోయారని
బుల్లితెర దోస్తులు పల్లెకథల వ్యథలుచెబుతుంటే
నేను నిజంగానే కవిత్వమై కరిగిపోతుంటాను
ఒక్కోసారి పల్లెవైపు పారిపోవాలనిపిస్తుంది
కాని నాపాదాలకు మాపల్లె తల్లిపూసిన పచ్చని లేపనం
ఈనగరం కొండచిలువ రోడ్డుపై నడుస్తుంటే ఏనాడో
కరిగిపోయింది
నిజంచెబుతున్నా ఈ నగరం వరూధిని
మాపల్లె పచ్చదనంకోల్పోయి శ్మశానంలా మండుతున్నధుని

★★★★

# వెతుకులాట

- ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్




నేను కోటికి పడగలెత్తిన కుబేరుణ్ణి !!
కాదు నేను నిజానికి కుచేళ్ళుణ్ణి!!
నిజంగా చెప్పాలంటే సిగ్గు లజ్జలు గాలికొదిలేసి
హీనంగా దీనంగా అడుక్కుంటున్న బుద్ధి హీనుణ్ణి నేను
ఆప్యాయతను అడుక్కుంటున్నాను
అవసరమైతే ధరకు అందుకుందాం అనుకుంటున్నాను
అయితే అది అంగడిలో దొరకదని అంతరాత్మ నన్ను మొట్టింది
బుద్ధి లేకుండా ఏమిటా ప్రయత్నం అని తిట్టింది
అభిమాన్నాన్ని ఆబగా ఆర్ధిస్తున్నాను ఎవరైన పంచకపోతారా అని
అంతరిక్షం లోన కుడా దొరకని వస్తువుకి ఆరాటపడుతున్నాను
గాలికి వణికిపోయే చిగురుటాకులా ఆపసోపాలు పడిపోతున్నాను
ప్రేమ అనేది పెనుతుఫానులో నావ అని తెలుసుకున్నాను
కాని ఆశ చావక మానవత్వం కోసం మహినంతా కలియబోసి
వెతికేను
గగనకుసుమం కోసం అన్వేషిస్తున్నావు దద్దమ్మా అని మనుసు
విసుక్కుంది
మంచితనం తో బ్రతకాలని ప్రయత్నించాను
మతిమాలిన వాడా అని కసురుకుంది నాలో నేను
ఎంతో ధనవంతుణ్ణి బలవంతుణ్ణి అని విర్ర వీగాను
పరమ దరిద్రుణ్ణి అని గుర్తు చేసింది నా ఆత్మ
విలువలు ఏనాడో వదిలేసిన వలువలు అని తెలిసింది
హతాశుడయిన నేను జీవితానికి ముగింపుకి వెతుకుతున్నాను
నా తరువాత నా గురించి వెతికే వారి కోసం వెతుకుతున్నాను
నా వెతుకులాటకి అంతం కోసం వెతుకుతున్నాను వెతుకుతూనే
ఉన్నాను!!!??

★★★

# కలత లేని రేయి

- స్వప్న. ఎం




వెన్నెలమ్మ ఒడిలో నిద్దరోవాలని
కలతలన్నీ కంటి కొసల నుండి జరిపి
దూరపు కొండల్లో బంధించాలని ఆశ ..!!!
చెంత చేరే ఊహలన్ని ఆశల పల్లకి ఎక్కించి
ఆనంద లోకంలో విహరించాలని
మదిలో కోటి భావాల వీణలు మ్రోగించాలని
తెలియని వింత ఆశ ..!!!
ఎడ తెగని ఆలోచనల సంద్రంలో కొట్టుకుపోయే మదిని
వల వేసి పట్టి జారిపోని కలని మదిలో నిలుపుకోవాలని
భావాల సారాల్ని అనుభావాల కలబోతల్లో తెలియాడాలని
మనసు ఆశ ..!!
అలుముకున్న నిశీధి నీడలను తరిమి
వెండి వెలుగులను కళ్ళలో నింపుకొని
రాగాల సరాగాలను సరిగమలతో సయ్యాటల్లో
చంద్ర కాంత ఒడిలో సేద తీరాలని
పిల్ల గాలి అల్లరులతో మమేకమై మరచి
తనివి తీరా ఆస్వాదించాలని చిరు ఆశ ..!!
తలపులన్ని తపనల్లో మునిగి
మనసు అలజడితో మమేకమై తేలియాడుతుంటే
నేనున్నానంటూ చెంతకొచ్చాయి వ్యధలన్నీ ..!!
అలిసిన మనసు కనులలో కలవరమై
కునుకు లేక కలతలన్నీ దరి చేరి
వర్తమానాన్ని చిందర వందర చేసి చిత్తడి చేస్తుంది ..!!
ఒక్కసారిగా కన్నీటి వ్యధలతో మనసంతా నిండి పోయి
బరువెక్కిన మనసు తాళలేక
రేయి గడిచే క్షణాలకై మనసు ఆరాటపడుతుంది ....
కలత లేని రేయిని
జీవితాన ఒక్కసారి అయినా అందివ్వమని ..!!

***

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

చిన్నతనమున నిన్ను చూసితిని నేను
ఎన్నడును నిన్ను మరచిపోయినది లేదు
కనులనెన్నడు నను నీవు కాంచలేదు
పరిచయమ్మన్నదే లేదు పలుకరింప

ఎవ్వరినొ నేను తెలియలేదెపుడు నీకు
నా మనస్సుకు తెలియు సంతతము నీవు
ఎల్లపుడు నిను గూర్చి యూహించుచుందు
నీదు రూపమ్ము మదిలోన నించుకొందు

యుగయుగమ్ములు నా యెదనుందువీవు
ఎచటనుంటివో నేడు నేనెరుగలేను
నన్నెరుంగవు – నేను శూన్యమ్ము నీకు
ఎరుగనేరవిప్పుడు మరణింతునేని

ఈ నిరంతరధ్యానమ్ము దేనికొరకు
చెంత లేనిది చెంతకు చేరలేదు
సత్యరాహిత్యమెరిగెడు శక్తి లేదు
నిజము లోపించి శూన్యత నిండలేదు

స్వాంతమందున నిశ్శబ్ద శబ్దమిద్ది
తెలియజాలని యాంధ్యపు తేజమిద్ది
వీడిపోయిన నీ ప్రతిబింబమిద్ది
జననమందని నీ ప్రేమ శ్వాస యిద్ది



చిత్రం: కె.రామ్మోహన్

**చిత్రాలు: వజ్రంశెట్టి పాండురంగ**

శ్రీ మన్మథ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
20 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
నా మొట్ట మొదటి కవిత విభాగంలో బహుమతి పొందిన కవితలు

# కాస్త జాగ్రత్త తల్లీ!

- ఇందుర్తి వెంకట ప్రభాకర రావు




అమ్మ కడుపు లోంచి
ఆత్రంగ తొంగి చూసే ముందు
నిన్ను అందుకొనే చేతులు
ఏం చెయ్యబోతున్నాయో
కాస్త జాగ్రత్త తల్లీ!
అమ్మ నాన్నల మీద
నీకున్న నమ్మకాన్ని
వాళ్ళు ఆదరిస్తారో లేక
నిన్ను మొగ్గలోనే తుంచేస్తారో
కాస్త జాగ్రత్త తల్లీ!
పట్టు పావడాలు వేసి
కాళ్ళ పట్టీలు పెట్టి
నీ బుడిబుడి నడకలకు
పొంగి పోతారో లేక
కట్టుబొట్ల ఉగ్గుపాలతో
నిన్ను బానిసను చేస్తారో
కాస్త జాగ్రత్త తల్లీ!
చదువుకుందామని బళ్లోకి నువ్వెళ్తే
ఒళ్లోకి తీసుకుని చనువు తీసుకుంటే
కాస్త జాగ్రత్త తల్లీ!
కాలేజీ పూతోటలో
రంగు రంగుల పూలని
అందుకునే ఆత్రంలో
తుప్పల్లో ముళ్ళుంటే
కాస్త జాగ్రత్త తల్లీ!
మేముంటె నీకు
భయమేమీ లేదంటూ
అభయ హస్తము చూపి
నిర్భయ చట్టాలు చేసి
చేతులు కడిగేసుకుంటే
కాస్త జాగ్రత్త తల్లీ!
మనసు పారేసుకొని మనువాడుదామని
కడదాక కలసిరాని కలహాల కాపురమైతే
కాస్త జాగ్రత్త తల్లీ!
నీ కన్న పిల్లలే నువ్వు బరువని తలచి
నీ బతుకునే నిత్య నరకము చేస్తే
కాస్త జాగ్రత్త తల్లీ!

★★★




ఆ ఏటి ఒడ్డు దిగువలో
నీలిమంటల చితి మధ్యన
"పండి"పోతున్నదెవరో?
పారే ఏరూ, ఎగిరే పక్షీ,
అక్కడక్కడే తిరిగే కుక్కా తప్ప
నలుగురి మనుష్యుల జాడ కనిపించదే!
బహుశా....
అతడు ఒక అనామకుడై ఉండి ఉండవచ్చు!
అతడికోసం
నాలుగు అనునయ వాక్యాలు చెప్పేవాళ్ళూ
రెండు కన్నీటి చుక్కలు రాల్చేవాళ్ళు
లేకపోయినా --
నీలిమంటలకావలి ఒడ్డున
విస్తారంగా విస్తరించుకున్న అడవి
కొండలు, గుట్టలు చలించిపోతున్నాయి
చిత్రంగా వందంటే వందే నిమిషాల్లో
అతడు పొగై ఆకాశంలో
బూడిదై భూమిపై మిగిలిపోయాకా
సాయం సూర్యుడు
స్నానం చేయడానికి
ఏరు తిరిగిన మలుపులోకి దిగిపోతున్నాడు.

★★★

# యువతా! మీ నడత మన ఘనత

-ఆచార్య నడిమింటి శ్రీరాం




వనరులే లేనట్టి వెనుకటి కాలాన
వెతలెన్నొగాంచి మరి వెలుగు గంటిమయ్య,
చదువొకటె దొరని చక్కంగ చూసితిమి,
తెలిసి మసలుకొనుము తెలుగింటి యువత!

ఇబ్బందులెన్నియో ఇష్టముగ భరియించి
చదువుకై మిమ్మల చక్కగా పంపెడి
తల్లిదండ్రుల తనివి తీర్చకుండుట తప్పు
చదువు మరి నీ నడత చూసుకో యువత!

ప్రతి కుర్ర చదువుకై ప్రజల సొమ్మే సుమ్మ
ఖచ్చితముగ రోజ ఖర్చువేలగు చుండు,
పట్టదా ఈ కబురు? పతన బాట యేల?
మసలుకొనుమ మరి మా మంచి యువత!

అయ్యకొన్న బైకు అప్పనముగ వాడి,
క్లాసు బంకు కొట్టి కాలేజి విడచి,
తిరుగుళ్ళు, సినిమాలు, తగున తండ్రి?
తల్లిదండ్రుల మనసు తెలుసుకో యువత!

అయ్యవారలను మరి అతిగ అవమానించి,
అక్క చెల్లిళ్ళను ఆటల పాల్జేయు,
అర్థరహితములె కద ఆటలు పాటలు,
సినీమాలు కావు చెత్తబుట్టలు సుమ్మ.

తన్నుటల్, తిట్టుటల్, తగువులాటలెన్నో,
మాటిమాటికెన్నో మతిలేని చేతలు,
సినీమాలా అవి చవకపనులే కాక,
బుద్ధివచ్చునా అవి బుద్ధిమంత! యువత

కథానాయకలొద్దు కద తెలుగువారైన,
కథానాయకుడేమొ కొడ్కొ, మనవడొ, మర్దొ,
కథైతె దొంగదొ, కటిక అబద్ధమ్మొ,
కద నేటి సినిమాల కథ మరి కాంచగా.

నాటి సినిమాల్లోని మేటి పాటలు కోటి,
నేటికిని పాడెదరు నేతలు, రైతులును,
ఇంటిలోని ఇంతి, ఇష్టముగ కూలి,
అమ్మమ్మ, నాన్నమ్మ, తాతత్తమామలును.

కూనిరాగము గైన, కోటలో పాడినను,
అందరిని రంజించు ఆనంద డోలికల్,
ఏమి ఆ బాణీలు, ఏమి ఆ పలుకులు?
ఎక్కడెక్కడికోను ఎటులో మనసు పోవు.

అట్టి పాటలు రాయ మరచితిర కవులు?
గుండె బెంబేలెత్తు గట్టి శబ్దపు మోత,
ఇపుడు వినిన మళ్ళిపుడె మరచేటి,
చప్పుల్ల పుట్టించు పాటకారులు నేడు.

చూచిన నేటికిని చీర వాడకమ్ము
తల్లక్కచెల్లెల్ల, మన తనుజ లిష్టమే;
వారి వలువలు దొరి వారి చిత్తమ్మే;
కాని సినిమాల్లోన కానిస్తురా అటుల?

ఇంట బయట చూతు మింతుల తీరులు
చక్కన్ని భారత సాంప్రదాయము మేరె,
సినీమాలో మరి! సిగ్గు కలుగు తీరు
దుస్తులు, తీరులు, దుష్టవాలకములు.

మాటల్లో లేదు మరి స్పష్టతే అసలు
మాట వినబడకుండ మ్రోత వెనుక
మాటక్కొకటైనను అర్థాలు వేర్వేరు,
మాట, భాష, పలుకు మొరటు తీరు.

కథానాయకున కనేకులు తోకలు,
వారి పని గెంతుట, వాగుట, పేలుట,
కోతి చేష్టలతో మరికోతుల్ని మరిపింత్రు;
వినగ చూడ కలుగు విసుగు వారి వలన.

చదువుతో పాటుగా చక్కగా ఆటల్లో,
పాట, నటన లందు, ప్రజాసేవల్లోన
వెలిగేటి వయసిది, వజ్రంపు తునక!
నలుగు రొప్పేదైతే మంచి నడతే యువత!

చదువుకున్న నారి చక్కన్ని అమ్మగు,
కూల్రైతు వడ్రంగి కుమ్మరి కమ్మరి
నెవరికైన చదువు సానపట్టు సుమ్మ,
చదువె ఆస్తని మరి నుడివితిరి యువత!

క్రమశిక్షణ అన్నది క్రమముగా నేర్చు,
సాంఘిక నిజములు చాల బాగా నేర్పు,
భావి జీవితంపు భాటలవి నాయనా!
భావె చూడు, నేడు భోగి కాక, యువత!

మాటల్లో, తీరుల్లో, మరి నీదు నడతలో,
జన సంపర్కంలో, జాతి సేవల్లో,
ఆలోచనలలో, ఆత్మగౌరవంలో,
తెలుగు తల్లినెపుడు తలుచుకో యువత!

పారాల పంటలను పంచు మందిరాన
జాతి సంఘాలంచు, శాఖ సంఘాలంచు,
పార్టీల చెడు బురద పైన చల్లుకోవద్దు
పై చదువు మార్గాలు పట్టుకో యువత!

పార్టీల కప్పుడే కాలిబంటువు కాకు;
జెండాల్పట్టు కొని జైజైల్కొట్టుచూ,
వెర్రి వాడ్వలె మరి వేషాల్వెయ్యకోయ్;
వోటైతె నీది మరి వెయ్యి తప్పక యువత!

పార్టీల పాటల్లో పావుగా మారకు,
నీ కాళ్ళ నడకను నీవె బంధింపకు,
ముందు మనిషి వవ్వు మరల పార్టీలు,
కొల్లగొట్టు వార్ని క్రోధించు యువత!

క్రాంతి నుండి పోయె కాంతియే అసలు
భ్రాంతియె మిగిల్చె నా క్రాంతికారుల నడత
అట్టి పనికిరాని అన్నల బాటేల?
గెలువు మిల్లు ఊరు గెలువు యువత!

చదువు ముందుగ పొంది, చక్కన్ని మనిషివై,
మల్ల చేతువుగాని మరి రాజకీయాలు,
చదువులో మొద్దులు చౌక నేత లౌదురు,
చౌక నేతలైతె చీడ లింటికి యువత!

చదువు యున్న చాలు చెలగుదువు లోకాన,
చదువు లేకున్నచో చెడు జీవితం బబ్బు,
చదువె గురువు, ధనము, చక్కన్ని దోస్తు,
చదువుపై ధ్యాసుంచు చక్కన్ని యువత!

చదువె ఉద్యోగమ్ము, చక్కన్ని జీవితము,
చదువె అభిమానమ్ము, చదువె సర్వమ్ము,
లోకాన గౌరవము లబ్ధింపజేయునది,
తెలిసి మసలుకొనుమ తెలుగింటి యువత!

★★★

రేఖాచిత్రాలు: వజ్రంశెట్టి పాండురంగ




హరుని సిగ నుండి అవనికరుదెంచి
లలిత ప్రకృతికి చలిత ప్రవృత్తిని
అనురాగమ్మున్గా  ఆకుపచ్చ అందాలమర్చి
తొల్లి త్రయంబకేశుని ఆరాధించి
అక్షరవిద్యనక్షరమ్మున్గా అందించే
బాసర భారతి పాదాలంటి పునీతయై
వెండి వెన్నెల్లో విహరించి తెలుగు వెలుగుల
తెనుగుతల్లికి తళుకు తరంగాల వందనమొనర్చి
భద్రగిరి రాముని పాదాలు కడిగి
పాపికొండల నడుమ వయ్యారముగ ఒదిగి
నన్నయ పద్యాల తో రాజమహేంద్రినలరించి
కోటిలింగాల రేవులో కోటికులుకులొలికి
దక్షిణ గంగ ఉప్పొంగంగ
కోటిపల్లి సోమేశ్వరుని ద్రాక్షారామ భీమేశ్వరుని కొలిచి
అంతర్వేది నరసింహునర్చించి
దారి పొడవునా అన్నదాతకు ఆనందమొనర్చి
చెలియలకట్ట వద్ద సప్తగోదావరులు సగర సాంగత్యానికి
సుగమ సంగీతాలతో పరవళ్ళు తొక్కేవేళ
అందుకోవమ్మ గోదావరీ
మా అక్షర నీరాజనం!! ★★★




1.
ఏం రాయను..?
అనంత కాంతి సంవత్సరాల తర్వాత...
నాలో నిన్ను వెతికి పట్టుకోవాలని...!!
దూరాన్ని దగ్గరగా శపించుకొని
నేను గుర్తున్నానా...?
అని నా అంతరంగపు విరహాన్ని అడిగితే ఏం చెప్పను...?
చలన సూత్రాల నిండా బహుముఖ స్వాప్నిక జగత్తును గుండెకెత్తుకొని
నీకై... నీదై... రోదిస్తున్నా... ఏం చెప్పను...?
నీవు లేని క్షణాల్లో ఎదలో రగిలిన కణాల జ్వాలాక్షరాలను
ఎలా రాయను?
అన్వేషణ ఆఖరి పుట తిరగేస్తూ...
ఒక్క ఓదార్పు భాష్పజలమై నిరాశగా జారుతుంటే
ప్రియా... గుర్తున్నానా అంటే ఏం రాయను...!?
నాలో నిన్ను...!!

2.
పరిణామ గతులలో...! శిశువు కేకలో...!!
చీకటి విచ్చిన కాంతుల్లో...!!!
వివర్ణాలైన నా హృదయ శబ్దంలో..!!
ఏ తాత్వికతా ఇవ్వలేని నిర్వచనంగా వెతికిన ప్రతిసారీ
భాష లేదు...? భావం లేదు...? భ్రాంతి లేదు...?
అంతా ఒక్కొక్క మరణ శ్వాస క్షణాలు.
ఆనందానికి, అనుభవానికి మధ్య కూలిన వంతెనపై కూర్చొన్న
ఏకాకి హృదయంతో వెదుకులాట...! "వెత"కులాట...!!
అనం సృష్టి చలనాల్లో....! అది భౌతిక నిగూఢ స్పర్శల్లో...!!
నీ పాద మృదు రజానికై...!!! గుర్తులకై... వెదుకులాట...
సాహిత్యాన్ని, సౌందర్యాన్నీ పెకలిస్తూ రాలుతున్న హృదపూల ఘోష
విభజన లేని కణం చుట్టూ నువ్వూ, నేను. నేను నేనే.
ఆ క్షణాల అంతా షెటిల్లమనే చీకటి...!!
అవే కదా నువ్వూ నేను కలిసిన చివరి, మొదటి క్షణాలు.
3.
అప్పటి నుండి వెదుకులాట!
నాలోకి నేను, సృష్టిలోకి నేను
కళల్లోకి సాహిత్య, సౌందర్య పిపాసినై నేను.!!
నీకై... కై... మారుతున్న జాగాలలో మనసు పారేసుకుంటూ
చరిత్ర బీజాలకు మన పంచేంద్రియాలకు ప్రాణంగా పోస్తూ...!
బతికిస్తూ నేను... నీవు అయిన నేను.
నీవు కాని నేను...!!
4.
అంతా శబ్ద చలనం... అంతా నిర్మితం... అంతా కృత్రిమం...
అంతా నీవు కాలేక పోతున్న నేను...!
భాషించలేని భాష సాక్ష్యం.! ఎదకు ఎదకు ఎడారంత దాహం!
శరీరానికి ఎదకు సముద్రమంత వేడి నీవైన నాకు...,
సాక్ష్యాలు లేని బతుకుల్లో...!
ఎలా ఉన్నావు...?
నీవు లేని నే... అలవాటైపోయాను.! పోతూనే ఉన్నాను...!!
నా గుండె వేలు పట్టుకొని, కళ్లకు గంతలు కట్టి
ఎవరో బలవంతంగా ప్రేమగా లాక్కెళ్లి పోతున్నారు..!?
5.
నీ జాడల్లేవు... నీ పాటల్లేవు... షెహనాయ్ మూగబోయింది.
కవాటాలు మూసేసుకుని నాలోకి నేను నీవుగా కుదించేసుకుంటున్నా
ప్రవాసంలోకి పోతున్నా...!!
అయినా...!
నీ కోసం జన్మజన్మలకు నాలోనేను తవ్వకాలు జరుపుతూనే ఉన్నా
ఉన్నా...! ఉంటున్నా...! ఉంటూనే ఉన్నా...!!
అందుకే ...!
నేనిప్పుడు నీకై కవిత్వంగా చెక్కుకుంటున్న సైకత శిల్పిని.
ఇలా... లా... లా... ఇలానే....!? ★★★★




పెద్దగా
గమనించ లేదు
తెలియనూ లేదు
వెనక్కి తిరిగి చూసుకుంటే ఆశ్చర్యంగా ఉంది
కేవలం పదేళ్ల క్రిందటి దారులు ఇప్పుడు లేవు
బహుశా పదేళ్ల తరువాత ఈ దారులూ ఉండవు
వయస్సు నీడలో కూర్చుని ఆలోచిస్తే
కల్పనో నిజమో అనిపించే జ్ఞాపకం చెబుతోంది
జీవితప్రవాహం ఎన్నెన్ని దారులుగా చీలిపోయిందో

★★★




నా కోసం నేను జీవించి ఎన్నాళ్ళయిందో
నీ ఇష్టాలని నా ఇష్టాలుగా మలచుకుంటూ
ఆశలని, ఆశయాలని , ఆవేశాలని వదిలేసుకుని
అనుభూతులు లేని అనుభవాలను భరిస్తూ ,
నన్ను నేనే పోగొట్టుకొని నువ్వుగా మారానన్న
భ్రమలో బ్రతికేస్తూ..,నీ చుట్టే పరిభ్రమిస్తూ
నీతోనే జీవితం అంటూ భ్రమిస్తూ ..,
ఎక్కడో ఏదో చిన్న ఆశ , ఏదో పాశం
కలల బేహారిని నేను ,
అనుబంధాల వ్యాపారివి నువ్వు
కలిసి పయనిస్తూ , కలవని మనసులతో
సమాంతర రైలు పట్టాల్లా ఎన్నాళ్ళిలా ?

★★★




నీలోలోపల
ఎగసిపడుతున్న
లోహకణికని
చల్లారనీయక...

మండుతున్నప్పుడే
నాలుగు సమ్మెట
దెబ్బలు వేసి
దాన్నో అక్షరశరంగా
తయారుచేయి...

ఏదో ఓనాటికి
నీ అక్షరం కాకపోదు
సమాజాన సామాన్యుడి
చేతిలో ఆయుధం...

పుట్టుకతో అంతా
శ్రీశ్రీ లైపోతే నీలో ఆవేదనల
పురిటినొప్పుల బాధ
ప్రపంచానికి చాటేదెవ్వడు...

అవహేళన చేస్తారేమో
అని నీలో ఉన్న
అక్షరజ్యోతిని ఆర్పేస్తే
నీవాశించిన వెలుగుని
ప్రపంచానికి పంచేదెవ్వడు...

ఏమో ఎవడికి తెలుసు
ఏ అక్షరంలో అమృతముందో
ఎవడి అక్షరం భావితరాలకు
ఆయుధంగా మారనుందో...!!!

★★★★




కొన్ని భావాలు పాతవే ఐనా
జ్ఞాపకాల దొంతరుల మధ్యనుండి
ఆలోచనల ఒడిలోనికి జారిపడి,
పాత పదాల కుబుసాన్ని విదిలించుకొని,
కొత్త పదాల చర్మాన్ని నిగారించుకొని,
మనో ఫలకంపై మెరిసినప్పుడు,
అవి విచిత్రంగా మనపై
కాంతిని, శాంతిని కూడా కురిపిస్తాయి.
వినూత్నంగా మురిపిస్తాయి.
కొన్ని భావాలు కొత్తవే అయినా
సమన్వయం కుదరని పదాల
పదఘుట్టనలో పడినలిగి,
వాటిలోని స్పందించే గుణం తొలగి
విచిత్ర విన్యాసాల పాల్పడినందుకు
విరక్తిని కలిగిస్తాయి,విముఖతను వెలిగిస్తాయి.

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

బాటసారినై యెచటికో పయనమైతి
ప్రేమ యర్థమ్మదేమియో వెదకికొనుచు
తిరిగి వచ్చితి జగమెల్ల తిరిగి తిరిగి
తెలిసికొంటిని ప్రేమ నిస్తేజమంచు

ప్రేమ దారులనెంతగా వెదకికొన్న
వేదనయె మెండు సౌఖ్యమ్ము వెలితి యౌను
ఎగయునొకపరి హృదయమ్ము గగనమందు
కరగి యొకపరి కన్నీటి కాల్వ యగును

ప్రేమ యన్నది మది విలపించు కొరకె
పవలు రేయియునిడుముల బడుట కొరకె
కలుగునానందమెంతైన క్షణికమగును
స్వాంతమున నిండు కలతయే శాశ్వతమ్ము

ప్రేమ యననెద ముదముతో వెలిగిపోవు
ప్రేమతో పాటు కాలిడు పెక్కు వెతలు
వెతలు తెలియరు ముంచెత్తు ప్రేమయందు
కలత కనుమరుగౌను సౌఖ్యమ్మునందు

కనుల ముందర కాలమ్ము కరగిపోవ
కష్టమెక్కువ తోచు సౌఖ్యమ్ము కన్న
రాగమే క్లేశమునకు కారణమటంచు
తెలియు క్షణమున దూరమౌ కలతలన్ని



చిత్రం:కె.రామ్మోహన్

చిత్రాలు: వజ్రంశెట్టి పాండురంగ

శ్రీ మన్మథ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
20 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
యువతరం విభాగంలో బహుమతి పొందిన కవితలు




అడవుల్నీ, ఎడారుల్నీ నిలువెల్లా నింపుకున్న నిశ్శబ్ద కుటీరం మా ఇల్లు
అనుక్షణం తన తలుపు రెక్కలను వెనక్కి సాచి
ప్రకృతినంతా తన హృదయకుహరంలోకి ఆహ్వానిస్తూనే ఉంటుంది.
వేకువను దోసిళ్ళకొద్దీ తాగుతూ మేల్కొన్న కళ్ళకు
దూలానికి ఎర్రని గుమ్మడికాయలా వేలాడుతూ దర్శనమిస్తాడు
ఇంటిరక్షణాధికారి సూర్యుడు.
మునుపటి రాత్రి
అదృష్టాన్ని దొంగిలిద్దామని
మూలమూలకు వెళ్ళి పాగా వేసిన చీకట్ల దిష్టి దొంగల్ని
తన కోటి కర కరవాలాలతో శిక్షిస్తాడు.
మెదడు గవాక్షాలను తెరచుకుని
నిరంతరం నీలాకాశంతో ముచ్చటిస్తూనే ఉంటుంది మా ఇల్లు.
కొన్ని రాత్రిళ్ళు భావావేశానికి లోనై ఆకాశం హఠాత్తుగా కరిగిపోయి
అమాంతంగా కౌగలించి, అణువణువూ తడిమేసి, తడిపేసి పోతే..
ఆ స్పర్శతో చెమ్మగిల్లి
ఆనందంతో తడిసి ముద్దయ్యి మాపై నిద్రనీడను కూడా పడనీయదు.
తెల్లవారులూ మా కళ్ళలో పుచ్చపువ్వులు పూయిస్తుంది.
ఎర్రని నిప్పురవ్వలు మొలకెత్తిన కళ్ళతో మా ఇంటిని చూస్తే
అప్రయత్నంగా
నాకు చదువు నేర్పిన బడి లీలగా ప్రతిబింబిస్తుంది.
అక్కడా అదే స్థితి.
నాలాంటి ఇళ్ళు
కూలిపోతున్న బళ్ళు
నిద్రలేని కళ్ళు
ఇలా ఎన్ని ఉన్నాయో నా దేశంలో...
240 కోట్ల చేతులున్న నా దేశంలో
మార్పుకోసం ప్రయత్నిద్దామంటే
ముందు నా చెయ్యేలేవదు.

***




కాలం రంగు బాగా వెలిసిపోయింది.
ప్రకృతి పాటకి శృతి లయలు తప్పిపోయాయ్.
మీ తరం వాళ్ళు కలవరించిన కొన్ని మాటలకి అర్థాలు
అంతర్ధానమైపోయాయ్.

గిర్రున తిరిగే గడియారపు ధ్వనులు
వెలకట్టలేని మీ సూక్తుల్ని
మనసుతో తడుముకోవడానికి అడ్డుపడతాయ్
ఆచరించడానికేవో అహాలు అడ్డొస్తాయ్.

పరాయి భాష
మీరు ప్రేమించిన తెలుగు అక్షరాల మీద ఒలికి
భాషాభిమానంలో పుట్టిన పగుళ్ళలో దూరి గడ్డకట్టి
విజయగర్వంతో వికటంగా నవ్వుతూంటుంది.

కాలం నాణ్యత నశిచిపోయింది.
తృప్తి నిండిన బ్రతుకుంటే ఇప్పుడు
అయినవాళ్ళ సమక్షంలో గడిపే క్షణాల తూకం కాదు
మనసూ మెదడూ ఏకమైన పదార్థాన్ని
ఖండ ఖండాలుగా విడగొట్టి
ఆధునిక ఎలెక్ట్రానిక్ పరికరాల్లో
ఒకేసారి చొప్పించగలగడమే బ్రతుకుతూ ఎదగడం.

(అ)నాగరికపు పొగలు
మీరు మా మనసుల్లో చిన్నప్పుడే ముద్రించిన
ప్రేమ కాంతుల నడక దారిని మసకబారుస్తున్నా
మండుతున్న కళ్ళని బలవంతంగా తెరుస్తూ
తప్పని కొన్ని గాలులకి ఒరిగిపోతూ కూడా
పాదాల్ని బలంగా ఆ దారి వైపే మళ్ళిస్తున్నాను
నా పాప చెయ్యి కూడా పట్టుకుని.

మీరు లేరు కానీ
ఇప్పుడు జీవితాల నిండా
దారులు కనిపించని కాంతి లోకాలు..
దాహం తీర్చని సముద్ర తీరాలు..

***

# ' నిర్భయ 'మా ? ఈ లోకరీతి

– ఏ. మారుతి




చిగురు తోటలోన చిత్రవీధులందు
చిన్ని పొన్ని కొన్ని గూడులందు
అలవిమీరిన ఆటలాడుచు పాడుచు
మించి పొంచిన కొన్ని పావురములున్నవి

నలుపు రంగును జూసి నవనీతమనుకుని
రూపదంభములొకింత మిన్నయనుచు
ఎత్తు కెగయుట, బలములు, ఘనతయనుచు
గ్రద్దతోడ నొక పక్షి చెలిమి చేసే

అనయంబు దానిని సేవించుటేగాని
తానేమి తిన్నదో ఎరుగలేక
దాని ఆనందమొక్కటే అద్వైతమనుచు
తన జీవితంబెల్ల పిండిపోసి

ఒక్కనాడు గూడిచి ఒక్కనాడు మరచి
ముళ్ళ గూడులోన తీపికై వెదకుకొనుచు
గువ్వ వెంటనె ఇంకొకటి వెరట పడుచు
ప్రేమ యనుకొంచు తనకూతా మొసపోతూ

మూరమొక్కకు ఊయల గట్టినట్లు
పొద్దు గూకక దీపాలు వెట్టినట్లు
అనుసరించెడి వానిని విడచి పక్షి
గ్రద్దతోడ ప్రేమగా గడాపసాగె

చిన్ని గుడసెను అలలతో గొట్టినట్లు
అస్తమించని రాహువు కబళినట్లు
వలపు, వలలను విసిరిన గ్రద్ద చేరి
పావురంబు నొకనాడు పట్టి చంపి,
కోర్కెదీరంగ తానారగించె.

పావురంబుకొరకు పచ్చ చిగురులు దెచ్చి,
ఆరగింపులకొరకు చేరరాగ
ప్రేతముగ జూచె ప్రేమచెలిని
వగచి వగచి కూలెనా పక్షికూడ.

ఒకటి లోకంబు నెరుగక మోసవోయె
ప్రేమపేర ఇంకొక్క బతుకు పోయె
కలికాలంబన్న కానిలమన్న
చిట్టిపిట్టల బతుకులాగిపోయె. ★★★




ఆమె ఒక అందాల వారాశి
ఆమె ఒక కవితల కాణాచి
ఆమె నడచిన బాటన
నవ్వుల సవ్వడులు విరబూస్తాయి
ఆమె నిలిచిన చోటున
మట్టిపువ్వై మనసు నిండా పలకరిస్తుంది
ఆమె అనుబంధాల పొదరిల్లు
సుమ గ్రంధాల హరివిల్లు
ఆమె పలికిన ప్రతి పలుకు
పరవశంతో గాలి పల్లకీలలో ఊరేగు
ఆమె అల్లిన ప్రతి అల్లిక
మానవ మేధలో నవచైతన్య వేదిక
ఆమె చీకటి చరిత్రకి వెలుగుల జాబిల్లి
ఆమె వికసించే వేకువకి
శ్రమ సౌందర్య స్వేదధార
ఎప్పుడైతే అతడు ఆమెని ఆశ్రయించి
అంతఃపురంలో బంధించాడో
నాలుగు గోడలే తన విశాల నగరమని శాసించాడో
అప్పుడే ఆమె ఆమెని కోల్పోయింది
అతడు ఇప్పుడామెని మరీ దారుణంగా
క్రూర మృగాలు జింకని వేటాడినట్లు
కప్పని పాము మింగేసినట్లు చూస్తున్నాడు

ఇప్పుడామె మబ్బుచాటున
చిక్కిపోయిన చందమామ
మత్తుమందు లేక శస్త్రచికిత్స
చేసుకుంటున్న ఉద్యమనేత
ఇప్పుడామే నిలువెల్లా భయం
నిప్పులేక తలబడిన చితాభస్మం
ఆమె అతడిని ఎప్పటికీ నమ్మదు
ఆమె అతడిని ఎన్నటికీ వదలదు
ఆమె దగాపడిన నమ్మకం
దగ్ధమవుతున్న తెల్లకాగితం
ఒకవైపు ఆమెని ఆరాధిస్తారు
మరోవైపు ఒంటితీగపై బండరాళ్ళని
విసిరేసినట్టు విరుచుకుపడతారు
ఆమె ప్రతి కన్నీటి బొట్టు
జాతి గుండెలో లాండ్ మైన్ ని పాతిపెట్టు
ఆమె ఆవేదనపు ఉసురు
అతడి భవిష్యత్తుకు వేకువ లేని చీకట్లు
ఆమె అతడిని ఎన్నటికీ
క్షమించని కారంచెడు
ఆమె అతడిని ఎప్పటికీ నమ్మని
నివురంటిన నిప్పు ★★★

రేఖాచిత్రాలు: వజ్రంశెట్టి పాండురంగ




భాష రాక, చేతకాక, ఓడకపోయినా ఓడినట్లు,
ప్రియనేస్తం పై యుద్ధంలో గెలిచి ఓడిన అనుభూతి!

పలకజాలను అని పెదవులు మొగ్గల్లా ముడుచుకున్నాయి
సంధిచేసే సంధ్యలేవో సేదతీర్చిపోతే బాగుండు!
ఊపిరాడని ఈ మౌనాన్ని ఛేదించుకుని పువ్వులా వికసించాలని
ఉంది!

గుచ్చుకునే మాటలన్ని మరచి ముందుకుసాగే తోవలేవో కనిపిస్తే...
స్వాభిమానం అడ్డుపడి ఆపకుండా అహాన్ని ముళ్ళకంచెలో వేసి
అనుబంధం అంచులు తాకాలని ఉంది!

అక్షరాలతో బరువెక్కిన గుండెను మాటలతో ఊరటపరచి
బలవంతపు ముసుగులు తీసి ముక్కలైన మనసుకు మందేదో వేసి
అనవసరపు సరిహద్దులు చెరిపి నీ జతగా నవ్వాలని ఉంది

మాటలతూటాలు వదిలినది ఎవరైనా... గాయం ఇద్దరికీ
పంతాలు పట్టింపులు అని అసలు మాట మరిచాములే...
నువ్వూ నేనూ ఒక్కటేగా, చెరోమెట్టు దిగి చేయికలపాలని ఉంది!

మనసు లోని మాటలతో అనుబంధపు వంతెన కట్టి
శాశ్వతంగా నీ మనసును చేరాలనిఉంది!

★★★

హృదయం భారమవుతోందని గమనించినప్పుడైనా
ఆ ఒక్కమాట చెప్పెయ్యాల్సింది
సారీలు, సముదాయింపులు చెప్పాల్సిన
సందర్భంలో చెప్పకపోవడం!
అవడానికి మాటలే అయినా
చెప్పకపోతే సముద్రాన్ని కూడా  రెండుగా చీల్చేస్తాయి.
ఎవరెప్పుడు అప్రకటిత ప్రయాణాలు కట్టేస్తామో!
సందిగ్ధ సంధ్యాచీకట్లలో మాయమైపోతామో!!
ఆ ఒక్క మాటా నేను చెప్పి ఉండాల్సింది.
గొంతు చివరిదాకా వచ్చి గొంతులోనే మిగిలిపోయిన ఆ మాట,
ఇంతటి కాలశూన్యతను, అపరాధ భావాన్ని తెస్తుందని
అప్పుడనిపించలేదు.
అందమయిన వాక్యం చివరిలో ఏదో విరామచిహ్నం కోల్పోయినట్లు,
మనిషికీ మనిషికి మధ్య అదృశ్యదారాలు చిక్కులుపడిపోయినట్లు,
మనుషుల మధ్యలో ఉన్నా ఒంటరితనం వెంబడిస్తోంది.
చెప్పకుండా వదిలేసిన ఆ మాట నా వ్యక్తిత్వాన్ని అదృశ్యం చేసింది.
ఆ మాట చెప్పి ఉంటె,
నీకు నాకు మధ్య రంగురంగుల  దృశ్యాలు కొన్ని ఘనీభవించేవేమో!
నిశ్శబ్దం కొంత సేపు నాట్యం చేసేదెమో!!
ఏది ఏమైనా అకాశం తడిసిముద్దయి నేలని గెలిపించేది ..!!!




★★★




శబ్దాన్ని నిషేధిస్తే
నిశ్శబ్దం శిక్షకు గురవుతుంది
శబ్దం నిశ్శబ్దం
ఏవి ఎలా మారిపోయాయో  తెలియక
నిషేధం నిష్ప్రయోజనమవుతుంది

★★★




పల్లవి :

అమ్మ కడుపులో హాయిగా ఆరంభమైన గమనం
మట్టిగుండెలో ఛాయగా నిదురించు వరకు పయనం
నేనడగకనే దొరికిన వరమే అమ్మా ! ఈ జన్మ
జన్మజన్మకీ నిన్నే అమ్మగ వరమిస్తే చాలు బ్రహ్మా

చరణం :

ఆ సూర్యుడైనా ఏ పొద్దయినా నిద్దుర లేచాడా ?
సుప్రభాతమై అమ్మ పాటేదో తట్టి లేపకుండా !
చందమామ ఒక క్షణమైనా చల్లగా కునుకు తీసిందా ?
మబ్బుల ఒడిలో జోకొట్టే అమ్మ జోల వినకుండా !

చరణం :

కడుపు మాడ్చుకుని కన్న బిడ్డలకి కడుపు నింపు తల్లి
తన కంటిపాపలో చంటిపాపలా సాకు కల్పవల్లి
కలల తేరుని విరుల తీరాల చేర్చే అల అమ్మ
గుండె అలజడిని అమృతధారగ మార్చే వరమమ్మ

చరణం :

ప్రాణధారనే పంచింది పాలబువ్వ తినిపించింది
మనిషిగా జీవించమని మరీ మరీ దీవించింది
నుదుట ముద్దాడి లాలించే అమ్మే తోడుంటే
నుదిటిరాతనే మార్చి వ్రాయగల సత్తా మనవెంటే ...
ఆ అమ్మ జన్మ సార్థకమవదా మనుషులుగా మనముంటే

★★★




గుండె నిండా ఎన్నో దిగుళ్ళు నిండి ఉన్నా,
నిండుగా ఉంది చోటు మెలిపెట్టే వెలితికి.
కా స్త దుఖం, కా స్త ఆనందం పంచుకోడానికి,
నా వాళ్ళని అప్పుడప్పుడూ గొప్పగా చెప్పుకోడానికి,
ముచ్చటగా మనసులో మాటలు పంచుకోడానికి
కొన్నైనా ఆత్మ బంధాలు కావాలనిపి స్తుంది......

పరుగు పందె మైన ఈ బ్రతుకున
బంధాలు కొన్ని మైలురాళ్ళు మా త్రమే ;
దూర మైనవెంత దగ్గరో,
దగ్గరున్నవెంత దూరమో చూపే కొలమానాలు,
అతికిన అద్దాల పలకల్లో ముక్క లైన ప్రతిబింబాలు,
ఒంటరి రాత్రుల్లో గాయపడ్డ కీచురాళ్ళ రొదలు,
అసంకల్పిత వైషమ్యాల వారసత్వాలు,
ఎంత దగ్గరున్నా అధిగమించలేని దూరాలు,
దూరమైన కొద్దీ భారమయ్యే గాథలు,
మౌనంగా స్రవించే అదృశ్య గాయాలు.

ముభావపు ప్రేమ ప్రకటనలో,
ము క్తసరి మాటల ముక్తాయింపులో,
కావల్సినంత ప్రేమ దొరకనప్పుడు,
కళ్ళలో ప్రేమ కురుస్తుందని ఆశించినపుడు,
చూపులు మరల్చుకొనే కక్ష్య సాధింపులో,
తగనంతగానే ఆశిస్తామో,
తగినదెంతో తెలుసుకోలేకపోతామో,
సందేహంతో దూరంగా జరుగుతామో,
పేగు బంధాల్నీ, కాసుల పై మోహాల్నీ
బేరీజ వేసి తాసులో తూస్తామో.
తడబడే త్రాసు పైకి కిందకీ అవుతుంటే
పేగుబంధం బరువుకి త్రాసు కిందకి జారేలోపల
బతుకు తెల్లారడం తెలుసుకోలేమో.

చదరంగపు బల్లపై నలుపు ,తెలుపు పావుల్లా
ఎదురుబొదురుగా ఒకే చోట కలిసే ఉంటాం..
ఎప్పటికప్పుడు, ఒకరి కొకరు చెక్స్ పెట్టుకుంటాం

సువాసన వెదజల్లాల్సిన ఈ గం(బం)ధం చెట్టు
చీడ పట్టి లోలోపల మురుగుతోందని తెలిసి,
ముక్కు మూసుకుంటామే కానీ,
ఎవరి చీడ వారు వదిలించుకోక
ఒకరికొకరు మందు జల్లుకుంటూ
కంటి పాపలా కాపాడుకుంటున్నామని
ఎప్పటికీ ఆత్మవంచన చేసుకుంటుంటే,
ఈ బంధం చెట్టు కొమ్మలు, రెమ్మలు
కనుపాపల్లో అంపశయ్య లై పరుచుకుని
ఆద మరచి రెప్పలు వాల్చనియ్యవు.

తరుగుతున్న ప్రేమలో, పెరుగుతున్న స్వార్థమో
ఇరుకు మనసులో, మురికి రక్త నాళాలో,
జిహ్వ చాపల్యంతో లోపలికి నొక్కేసేదో
నిగ్రహించలేని నాలుక బయటకు కక్కేసేదో
మనసున రగులుతున్న అలజడులకి,
మనిషిన పెరుగుతున్న రక్తపోటుకి,
తీపి అనుభవాల వెర్రి కోర్కెలకి,
దిగమింగుకున్న చేదు నిజాలకి,
సమతూకం చేసే శరీరం దాచే చక్కెరకి
కారణాలు వెతికితే చూపటానికి
బంధాలు చూపుడు వేలుకి చుట్టాలు.

ఆవేశాన్ని నియమం త్రించినపుడు,
నిజాయితీతో నిన్ను నువ్వు బోనులో
నిలబెట్టుకుని ప్రశ్నించుకున్నపుడు.....
ఎప్పుడైనా నీకు నీ తప్పిదమో
లేక నా నిర్దోషిత్వమో
తెలిసొచ్చినపుడు, ఎప్పుడైనా
ఒక చిన్న sorry చెప్పాలనిపిస్తే
దాని గొంతు నొక్కేసే అహాన్ని
ఒక్క క్షణం పక్కనపెట్టగల్గితే
ఆలస్యం చెయ్యకుండా
చెప్పదల్చుకున్నది చెప్పేసెయ్,
లేకపోతే చాలానే ఆలస్యం అవచ్చు,
ఇక ఎప్పటికీ చెప్పలేకపోవచ్చు.

అంతవరకూ మాత్రం........
ఆత్మీయులుగా కలుసుకుని అప్యాయంగా
కష్ట సుఖాలు పంచుకునే కలలు కల్లలయిన
భంగపాటు బరువు మనసు భుజాలపై మోసుకుంటూ
మళ్ళీ మళ్ళీ ఎదురుపడటం తప్పనిసరైనపుడు,
లోపల చితి కోసం కట్టెలు పేర్చినంత నిర్వికారంగా
పైకి మాత్రం కొన్ని నిర్జీవపు నవ్వుల్ని మొహం పై
పులుముకుని
మన బంధాలను సాగినంతవరకూ సాగదీద్దాం.

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

వేదనయె దీర్ఘతమము జీవితమునందు
క్లేశముల మధ్య సౌఖ్యమ్ము లిప్త పాటె
వేతలు తిరిగిరా మోదమ్ము వెడలి పోవు
ముదము తిరిగిరా వేదనల్ మోహరించు

ఎన్ని కష్టములైన లెక్కింపబోము
కొలది మాత్రపు మోదమ్ము కొరకు మనము
అద్వితీయమద్భుతము హర్షానుభవము
శాశ్వతానందసంస్థితే స్వర్గమేమొ!

అడుగునడుగున దారిలోనడ్డుపడెడు
చింతలే లేని యానందసీమ యెచట?
ఆ మహాధామమునె స్వర్గమందురేమొ!
స్వర్గశకలమ్ములే మన సంతసములో!

ఎవరినో తొలిసారి ప్రేమించినపుడు
కనుల పసిపాప చిరునవ్వు కాంచినపుడు
ఇంద్రధనువు జూచి పరవశించినపుడు
బడయు మోదమే స్వర్గానుభవము మనకు

ఆ క్షణమ్ములె బ్రతుకునకర్థమొసగు
స్వర్గమననేమొ చెప్పెడి క్షణములవ్వి
క్షణములు యుగములౌను స్వర్గమ్మునందు
ఎదురు చూచునదట్టి సంతృప్తి కొరకె



చిత్రం: కె.రామ్మోహన్

రేఖాచిత్రాలు: వజ్రంశెట్టి పాండురంగ




తమకంలో కాలి - తన నుదుటినుంచి జారిన చెమట చుక్క
ఫేస్‌బుక్ లో పడలేదు
అదేపనిగా ఎదురుచూసీచూసీ - చూపుకలవగానే
అమోఘమనిపించిన ఆ చిరునవ్వు
ట్విట్టర్లో ఎగరలేదు
కలిపిన స్నేహపు చేతిలో కాయలు కాసిన వెచ్చదనం
లింక్‌డిన్ లో బలపడలేదు
ఎన్నో మోహాలు మరెన్నో ఆవేశాలు నేటి కరెంటు భాషలో
కలిసి అలిసిపోలేదు

మసకబారినా కళ్ళలో వెలుగు తగ్గలేదు
కార్పొరేట్లలో కొట్టుకుంటున్నా గుండె లబ్‌డబ్‌లింకా
శృతితప్పలేదు

మరోసారి ఆ పున్నమికోసం ఇంకోసారి ఆ ఆప్యాయతకోసం
అర్రులు చాచటమాగలేదు..
ఆదిమధ్యాంతరహితప్రేమ ఆనవాళ్ళని
అవలోకించడమూ ఆపలేదు
... ... ...

అసలైన సరంజామాని ఏ నెట్టూ వలపట్టలేదు
అలలైన జ్ఞాపకాలన్నీ మనసులో సుడి తిరిగేనే తప్ప
జల్లెడపట్టి ప్రదర్శించే వెబ్బింకా పుట్టలేదు..

ఏ నెట్‌వర్క్ కీ అందని ఏ సర్వర్‌లోనూ లోనూ ఇమడని
ఆనందరసపాతమై జాలువారే ఆపేక్ష

ఇంకా నాదే.. నాలోదే!!!

★★★




లోకం నిశ్శబ్దంగా నిద్రిస్తుంటే
సడి లేకుండా నిదుర లేస్తా
నా హృదయం కాన్వాసు గుడ్డపై
నీ రూపం చిత్రించేందుకు,
కాని ఏనాడూ సరిగా రాదు.
రంగుల ముద్దలన్నీ కలిపి
నీ రూపమని భ్రమిస్తా!
అసలు నువ్వెవరివో
ఎలా ఉంటావో తెలిస్తే కదా,
నీకు ఆకృతి నిచ్చేందుకు!
అయినా నిను చిత్రించాలనే తపన ఆగదు..
వేకువ మొదలు సంధ్య వరకు
అందరిలో వెదుకుతా,
నీ రూపం ఎవరిలోనన్నా కనిపిస్తుందేమోనని
కనిపించక నిరాశతో నిట్టూరుస్తా!
అయినా నా అన్వేషణ నాపలేను
అనంతంగా సాగుతూనే ఉంటుంది
నా వ్యక్తిత్వం సంపూర్ణం అయేవరకు...

***




పగలూ రాత్రుల సరిహద్దుల్లో
అతను ఎంత అమాయకంగా
ముచ్చటగా కనిపిస్తాడో
ఎంతసేపయినా చూడాలనిపిస్తాడు
సరిహద్దుని దాటాడా
అతన్ని ఎవరూ చూడలేరు
ఆపలేరు

★★★




అమ్మ అంతరంగమంత విశాలమవ్వాలని
ఆకాశం ఎప్పుడూ పోటీ పడుతూనే ఉంది,
ఐనా ఇప్పటికీ వెనుకపడే ఉంది.
అమ్మ సహనాన్ని అలవరచుకోవాలని
ధరణి ఎప్పుడూ ఆరాట పడుతూనే ఉంది,
ఐనా ఇప్పటికీ విఫలమౌతునే ఉంది.
అమ్మ త్యాగాన్ని అనుకరించాలని
ప్రకృతి ఎప్పుడూ ఆశ పడుతూనే ఉంది,
ఐనా ఇప్పటికీ అడియాసపాలవుతూనే ఉంది.

అమ్మ ప్రేమను మించిపోవాలని
అర్ధభాగం ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంది,
ఐనా ఇప్పటికీ ఎదురుదెబ్బ తింటూనే ఉంది.
అందుకే అవతారపురుషులు కూడా
అమ్మతత్వాన్ని అలవరచుకునే అవనికి వస్తున్నారు.
మహానుభావులు కూడా
అమ్మ మహిమను గుర్తించి అమ్మను కీర్తిస్తున్నారు.
అమ్మను సృష్టించిన ఆ దేవుడు కూడా
అమ్మకు ప్రణమిల్లుతున్నాడు.

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఎన్నొ వత్సరమ్ముల వెన్క కన్ను మరగి
తిరిగి ప్రత్యక్షమైతివీ దినము నీవు
హృదయమానందమున నింగికెగసిపోయె
మరచిపోయిన యనుభూతి మరల కలిగె

ఎటుల నను వీడి యేగితో యెరుగలేను
ఏల నిను నేను మరచితో యెరుగలేను
నన్ను గానక నీవిట్టులిన్ని యేండ్లు
తిరుగుచుంటివి వెతనంచు తెలిసె నేడె

నీ యెదను నాకు కలదింత నెలవటంచు
ఏను లేనిచోనింత చింతింతువంచు
నేను లేని నీ మది రసహీనమంచు
కొంచెమెరుగని మందభాగ్యుడను నేను

ఇపుడు నను చేర వచ్చితివిట్లు నీవు
ప్రేమ కరగి నీరయ్యె, జీవితము కరగె
ఇంక కాలమేదంచు రోదింపవలెనొ
గతపు లేమికి కన్నీరు కార్చవలెనొ

బాష్పములు లేవు ప్రకటింప భావములను
మాయమైనట్టి గతమింక మరలి రాదు
తిరిగి నను నీవు నిను నేను తెలిసికొన్న
ఎంత కాలమ్ము మన కొరకింక మిగిలె?



చిత్రం:కె.రామ్మోహన్

## జనంకావలిమనుషులు కావాలి మళ్ళీ!

కర్లపాలెం హనుమంతరావు

1

నాతిచరామి సంకల్పం చెప్పుకుని
అగ్నిసాక్షిగా సాప్తపదీనం చేసిన వాడు
కడదాకా తోడుంటాడన్న పుస్తెల నమ్మకం
వెన్నులో ఎన్ని పోట్లు దిగినా
ఆ మొదటి వెన్నెలరాత్రి కుసుమపరిమళశోభే
సంసార ఆశ్వాస విశ్వాసజ్యోతి కొండెక్కకుండా ఆపే అఖండశక్తి!

దింపుడుకళ్ళెం దగ్గరా
కన్నపేగు ఆఖరిపిలుపుఆసరాను ఆసించే
ఆఖరినిశ్వాసం అసలు స్వభావస్వరూపం విశ్వాసమే!

వరదలో పడి మునకలేస్తున్నా
గడ్డిపోచకోసం గుడ్డిప్రార్థనలు చేసేది ఆ విశ్వాసమే!
చెట్టూ పుట్టా రాయీ రప్పలోనైనా సరే
కంటిపాపను చంటిపాపలా కాపాడే రెప్పలదేవుళ్ళే మనిషి విశ్వసించేది!

చుట్టూ పెరిగే లోకం తనకేనని
గట్టిగా నమ్మే ఆ అమాయకత్వం మరోపేరే విశ్వాసం!

అమృతసాధనే ఆఖరి లక్ష్యమైనప్పుడు
హాలాహలం రేగినా మింగే శంభుడొకడుంటాడన్న భరోసా,
శీలవతి మానరక్షణకు పరీక్షసందర్భం ఏర్పడప్పుడల్లా
అపద్భాంధవుడిలా అడ్డొచ్చి ఒడ్డునేసిన విశ్వాసం
కనిపించుట లేదిప్పుడు!

2

కంచెపైని నమ్మకమే లోకంచేను నిశ్చింతనిద్ర రహస్యం
కంచెలే చేలని ఇంచక్కా భోంచేస్తున్నకాలంకదా ఇది!
కడబంతిదాకా ఆగే ఓపిక ఎవడికీ లేదు
అయినవాళ్ళకే అన్ని వడ్డనలూ! మొదటివిడతలోనే సర్వం
పరిసమాప్తం!
గజాననులకు గణాధిపత్యం ముందే
ఖాయమైపోయుంటోంది!
అమాయక కుమారుల తీర్థస్నానాలన్నీ వట్టి ప్రహసనాలే సుమా!
ఆషాఢభూతులకు ఇవాళ వేషాలుకూడా ఎందుకూ? దండగ!
ప్రజాపాండవులనలా అజ్ఞాతంలోనే ఉంచే
నయానయా వంచనల పంచదారగుళికలను
పంచుకుంటూ పోతే చాలదా!
దేవుడిమీదో, రాజ్యంమీదో
ప్రమాణాలు చేయడం పాలకులకదో వినోద విధాయకం!
న్యాయరక్షకులే నేరగాళ్లతో సరిసమానంగా బోనుల్లో
నిలబడుతున్న
విశ్వాసఘాతుక పతాకసన్నివేశమాలికే ప్రస్తుతం నడుస్తున్నది!

3

నమ్మకానికి అపనమ్మకానికి మధ్యనున్న సన్నటిగీతను
ఎవరు
ఎప్పుడు
ఎక్కడ
ఎందుకు
చెదరగొట్టారో నిగ్గు తేలాలి!
ప్రజావిశ్వాసమెంత కంటకప్రాయమైనా
కిరీటమల్లే మోసే జనంకావలిదళం మళ్ళీ కావాలి!
మాజీ జయప్రకాషులు
నమ్మి వదిలి వెళ్ళిన విశ్వాసకపోతాన్ని
తిరిగితెచ్చే నేతలు
మళ్ళీ పుట్టుకు రావాలి!

★★★

# మరోపుట్టుక దాకా..

రామజోగయ్యశాస్త్రి

జీవితకాలం పాటు తను...
నాకందకుండా పరుగెడుతూనే ఉంది
ఎట్ట కేలకు దొరికింది..కానీ..
ఆ క్షణాన్ని ఆస్వాదించేందుకు
నేనక్కడ లేను..
అంటే.. ఉన్నాను
తనలో లీనమై
తనే నేనన్నంతగా మమేకమై
నా ఇన్నేళ్ళ తీవ్రకాంక్షను
గుర్తించి గుండెలకదుముకుంటోంది.
ధన్యుణ్ణి.. కానీ
ఈ గాఢ పరిష్వంగంలోనూ
గాలి చొరబడే ఖాళీ ఏదో
స్ఫురిస్తోంది నాకు,
చాలదనిపిస్తుంది..
ఇంకా ఇంకా దగ్గరవ్వాలని..
నిజమే అంతదాకానే వెళతాను గానీ
ఆత్మను స్పర్శించలేకపోయాను..
గమనించిందేమో..
నా ప్రేమకాంక్ష తనకూ నచ్చిందేమో
పట్టు సడలించింది..
మరో పుట్టుకకు నాందిగా

★★★



## ఆముక్త మాల్యద
### స్వర్ణ అట్లూరి

నా బలాబలాలు, బలహీనతలు,
భయాలు, బాధ్యతలు
అన్నీ తెలిసిన నేనే నా గెలుపు ఓటముల చిట్టా
చిత్రగుప్తుడి పద్దులా వివరంగా వ్రాసుకుంటున్నా!

తడబడిన అడుగుల నడకలని,
తగిలిన ఎదురు దెబ్బలని
తిరిగి నడవటానికి చేయందించిన చేతుల్ని
మనసారా వినమ్రంగా స్మరిస్తూ కృతజ్ఞతతో వ్రాస్తున్నా!

'నేను' అనుకొని గెలిచి ఓడిన విషయాలని,
'మనం' అనుకొని ఓడి గెలిచిన ఆనందాలని
నేను - మనం ల మధ్య సాగిన తీపి చేదుల కలగలుపు
అనుభూతులని
గుణపాఠాల సంఘర్షణలుగా గుర్తిస్తూ వ్రాస్తున్నా!

దిక్కుతోచక చూసిన బిత్తర చూపుల్ని,
దేముడా దారేది అని చేతులెత్తేసిన క్షణాల్ని
కనులు మూసి నా మనోస్థైర్యాన్ని మేలుకొలుపుతూ చేసిన ప్రార్థనలని
మరోసారి స్మరిస్తూ ఆ తెలియని శక్తికి తలవంచి నమస్కరిస్తూ
వ్రాస్తున్నా!

ఆనందంతో ఎగసిన శృతిలయలని,
సంతోషంతో ఎదపొంగి పొరలిన వేళల్ని,
మనసు కదిలి రాలిన ఆనంద భాష్పాలని
దోసిట్లో పట్టి మనసారా అంజలి ఘటిస్తూ వ్రాస్తున్నా!

నా అనుభవాల సారాన్ని, నేర్చుకున్న పాఠాల పూలతో
ఆలోచనల్ని, అక్షరాల్ని, చేతల్ని కలగలిపి
జ్ఞాపకాల దారం తో కదంబమాలగా కట్టి
నా ' ఆముక్త మాల్యద ' గా సమర్పిస్తున్నా!

★★★

## భూమి
### డా. రావి రంగారావు

పుడమిలోపల క్రమముగా ఉడుకు హెచ్చు,
పైకి వెళ్ళుచుండిన చలి ప్రబలుచుండు,
బిడ్డలకు సమతుల్యత ప్రేమ నింపి
వెలుగు ఆదర్శ విశ్వైక విమల భూమి.

తిరుగుచుండియు సూర్యుని పరిధియందు
ఉర్వి తనచుట్టు తిరుగుచునుండు సతము
పరమ బాంధవ్య రుచులను వదలకుండ
స్వీయ సంసార బాధ్యతల్ మోయుచుండు.

అధిక సంపన్నరవిని మర్యాద చూచు
అంధకార చంద్రుని కూడ ఆదరించు,
భేద భావాలు తెలియని స్వాదుశీలి,
వసుధతో సాటి రారు దేవతలు కూడ.

సృష్టి వాయు రహస్యమ్ము తెలుసు భువికి,
ఆక్సిజను ప్రవాహాల కాత్మ అయ్యె,
కోట్ల జీవరాసుల గని కునుకు లేక
నిరతమును పెంచి పోషించు ధరణి మాత.

ఇల ఒసంగని సంపద లేవి లేవు,
మనకు ఇవ్వని అనురాగ మేది లేదు,
జీవ కోటికి చేయని సేవ లేదు,
అవని జల హృది పెద్ద, దేహమ్ము కన్న.

★★★

# గుప్పెడు చీకటి

దూర్వాసుల విజయభాస్కర్

అడుగులతో.. పరుగులతో..
ఎన్ని దాటిన మజిలీలు..
అయినా, ఏదో చేరని మైలురాయి వెక్కిరిస్తుంది.

నవ్వులతో.. మెరుపులతో..
ఎన్నో పంచుకున్న సంతోషాలు..
ఏదో వదలని విషాదం వెంటాడుతుంది..

మనుషులతో.. మనసులతో..
ఎంత మమైకమైనా,
ఏదో వీడని ఒంటరితనం లోలోన..





జ్ఞానం.. విజ్ఞానం.. నిజం..
తెలుసుకున్న జవాబులు అన్నీ గుర్తొస్తున్నా..
గుండె లోతుల్లో గుచ్చుకునే ప్రశ్నలు..
ఇంకా ఎందుకో..

రోజూ తెల్లారుతుంది..
మిరుమిట్లు గొలిపే వెలుగు..
ప్రపంచాన్ని నింపేస్తూ,
కానీ ఎక్కడో గుండె లోపల్లోపల
అతికించుకున్నపొరల క్రింద.. మరో ప్రపంచం అది..
నేను అని నేను లెక్కపెట్టుకునే చోట..
ఇంకా చీకటే.. ఓ గుప్పెడు ఉంటుందేమో.

సంపూర్ణమైపోతే.. మరి ఆగిపోతుందేమో.
అంతా అర్థం అయిపోతే.. మాయమవుతుందేమో..

జీవితం అంటే.. ?
బహుశా జీవించడం వరకేనేమో.
ఏమో.

★★★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

వెడలె నీ తోడ నాలోని వెలుగదెల్ల
ఇంత కాలమ్ము నా యింటనిరులు నిండె
కటిక చీకటిలోనేమి కానలేక
తెచ్చి వెలిగించితిని చిరుదివ్వెనొకటి

కలిగెనింటిలో సన్నని కాంతిరేఖ
వచ్చి చేరెను చిన్న దీపములు కొన్ని
దారి చూపించి నడిపించు తారలివ్వి
వెడలిపోయిన ముఖచంద్రబింబమీవు

బ్రతుకు కలిగినదాయువు స్వల్పమయ్యె
గడచెనెటులనో తెలియదు కాలమంత
బ్రతుకు చివరలో వెలుగువై వచ్చినావు
క్షణములే చాలు నీతోడు స్వర్గమయము

బ్రతికితిని బంధముల పరిష్వంగమందు
సేద దీరుదు నీ స్నేహసీమయందు
చివరి యంకాన ననునీవు చేరినావు
మరలి పోవికయంచు నా మదికి తెలియు

ఘడియలైనను బహుదీర్ఘకాలమైన
జీవితమునకర్థమ్ము నీ చెంత యందె
చివర వచ్చితివుందువు చివరి వరకు
కొలది బ్రతుకైన నీ తోడ కలసియుందు



చిత్రం:కె.రామ్మోహన్

# ---స్పీడ్ బ్రేకర్ మీద! ఎస్ ఆర్ బందా

అటూ ఇటూ అంచులు పగిలిన
ఆ ప్రపంచంలో బుడుంగున మునిగి
అగ్నిస్నాన సదృశమైన ఈ లోకంలోకి భళ్ళున తేలి
సగం కలా సగం తెలివీ సగం నిశ్శబ్దం సగం వూపిరీ
అన్నీ కలిగి రేగిన జ్వాల –
ఈ పదాల మాల...

ఒక వైరూప్య చిత్రం మనసు కేన్వాస్ మీద
ఒక వైరాగ్య హాసం పెదవి చివరంచుమీద..
తృప్తి రంగరించుకున్న తన నిశ్వాసం
చేతులు జోడించిన చిరు విశ్వాసం
నిషిద్ధ విస్మయాల మధ్య విలుప్త నఖక్షతాల ముద్రలు
ఇంకా ఆరని తడిని మరోమారు తడిమిన గుర్తులు
ప్రవాహంలో అప్పుడెప్పుడోనూ ఇప్పుడిప్పుడేనూ కాలికి తగిలిన కొమ్మలు
ఆవాహన పలకమన్న అతి రహస్యాల రెమ్మలు..
ఇంచక్కని వెండివాన రాల్చిన కనెప్పలు
ఇక దక్కని సుఖపు చుక్కకై మోడ్చిన చేతుల చిప్పలు..

నీరవ సత్వాల మీంచి నీరసరాగాలలోంచి
అదాటుగా వెలికురికే అస్పష్టపు త్రేనుపులు
ఎదురుచూపు పిండుకున్న ఒయాసిస్సు చుక్కలు

ఇవి ఆగే స్ట్రోక్స్ కాదు.. ఇవి ఆపే బ్రేక్స్ కాదు.

అసంఖ్యాక రేఖల్లో అత్యద్భుత శ్లేషల్లో
అవతారం చాలించని అద్వితీయ మూర్తులు

ఇవన్నీ
నమ్రతతో మూసుకున్న కళ్ళలోని చినుకులు..!

★★★

## చెలీ..!

ఆచాళ్ళ శ్రీనివాస రావు

పల్లవి :

పరవశాల పల్లకిలో పద మల్లికలే పరిచి
ఎదురు నిలిచినాను సఖీ ! వరమీయవె ఒక సాకి

చరణం :

శ్రీనాథ కవినాథ కౌగిళ్ళలో ఒదిగి
శ్రీరంగ సూర్యుని కెంపు కన్నుల వెలిగి
శృంగార అంగార హృదయాల రగిలించి
మా భావ కవిదేవ స్వప్నాన నిదురించి
ఎంకి పాటల వొంకి వొడ్డాణములు చుట్టి
కిన్నెరసాని గా కదలి ఆడిన సఖీ ..

చరణం :

అధర ముద్రికలను అడగలేదే చెలీ
కౌగిళ్ళ లోగిళ్ళు కోరబోనే సఖీ
కలత నిద్దురనైనా నే కనుమూయులోపయినా
కలనైన నా కలమునా కసారి తాకి
కొనగంటి చూపైన కరుణించవే చాలు
నీ చరణముల చెంత మరణమైనా మేలు ...!

★★★



## అంతర్మథనం
శ్రీకాంత్ ఒద్దిరాజు

చిరకాలంగా తెలుసుకోవాలని ఉన్నా
అపరిచితుల మధ్య నాకు నేనే
పరిచయమవుతున్నా
జడివాన కి తడిసినప్పుడే నులి వెచ్చని ఒడి కోరేది
తడి మనసు కి తగిలినప్పుడే మాలిన్యం వైదొలగేది
చుట్టూ సమూహం లో ప్రపంచపు వెల్లువనవుతా
ఒంటరి  సమయం లో నాలో నేనే లీనమవుతా
పులకించే ఊహల్లో పూదేనియ నేనవుతా
వినిపించే గొంతుల్లో విశ్వచరితనై వుంటా
కానరాని జాడల్లో ఇట్టే కనుమరుగై పోతుంటా
కలిసొచ్చే కాలాల్లో కట్టెదుటే
ఆవిష్కృతమవుతుంటా..!!

★★★



## నువ్వు - నేను
దీవి శ్రీనివాస్

బాల్యానికి భాష్యం చెప్పింది నువ్వు
యౌవ్వనోత్సవానికి దివ్వెలు వెలిగించింది నువ్వు
ప్రతిక్షణానికి పరిమళాలు అద్దింది నువ్వు
స్నేహ ప్రవంతిని చిలిపి మలుపులు తిప్పింది నువ్వు
చైతన్య సాగరానికి చేర్చిందీ నువ్వు
చెలీ...
తలపులన్నీ పుంజీభవిస్తే నువ్వు
తొలివలపు మంజీరాన్ని నేను..!!

★★★



# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

ఏ మహత్తర శక్తియో యెదుట నిల్చి
ఒక్కటే యొక్క వరము నాకొసగునెడల
వేడుకొందునింకొక్క జీవితము కొరకు
చేయి జారిన స్వర్గమ్ము చేరు కొరకు

వెడలిపోయిన నెచ్చెలి ప్రేమ కొరకు
ఎద యెడారిలో విరి వికసించు కొరకు
మించు పరితోషమెల్లెడ నించు కొరకు
వలయునింకొక్క జీవిత వరము నాకు

చూడనోచని యందముల్ చూచుకొరకు
పాడలేనట్టి పాటల పాడుకొనగ
మరచిపోయిన దారుల మరల తిరుగ
వలయునింకొక్క తీయని బ్రతుకు నాకు

కన్నుమరగిన చెలియను కలుసుకొనగ
పెదవి దాటని పలుకుల వెలువరింప
పొందజాలని యనుభూతినందుకొనగ
ఒక్క జీవితమే దైవమొసగు నాకు?

తరలి పోయిన కాలమ్ము తిరిగి రాదు
తిరిగి జనియింతుమో లేమొ తెలియలేము
ఏదియో శక్తి యా భాగ్యమిచ్చునెడల
గడియయైన చెలియ! నిను విడువబోను



## ఒకే కొమ్మ రెండు పువ్వులు!

బిక్కి కృష్ణ

మా అమ్మ ఆత్మ జాబిలమ్మగా మారిందేమో
లేకపోతే ఆకాశపుతీగను ప్రేమతెమ్మెరతో ఊపి
నక్షత్రాల ద్రాక్షపళ్లను నీవొడిలో ఒడిబాలుగా పోస్తుందా
పగడాలపెదవులపై చిరునవ్వులతో రోజా నన్ను
మురిపించి తనను మరిపించేలా మనల్ని దీవిస్తుందా
మా నాన్నమనసు ఉదయసూర్యుని వెండిగిన్నెలో
 వెన్నగా కరిగి కరుణ కిరణాలుగా కురిశాయేమో
అందుకే ప్రతి ప్రత్యూషవేళ లేఎండతాకగనే నీకళ్ళుమెరిసి
నన్ను మంచుగాలుల చల్లదనంలాంటి మాటలతో
మైమరపించమని నిన్ను నాకు తోడుగా పంపిస్తాడా?
 అంతులేని ప్రేమ గుండెలకుండల్లో పొంగుతుంటే
కవిత్వపు నీళ్లతో చల్లార్చుకునే భావుకతను
మనకు పంచిన ఆ అదృశ్యశక్తి ఎవరంటావు?
అది నిన్ను నన్ను కలిపిన ప్రేమై ఉంటుందా!
కాలం రహదారిలో మనం కలిసి నడిచిన
ఈ చిన్ని ప్రయాణంలో కలబోసుకునితాగిన అనుభూతుల పాలెన్ని?
ఆత్మలవిగ్రహాలపై సంప్రోక్షించుకున్న ప్రమాణాల పవిత్రప్రేమజలాలెన్ని ?
ఎన్ని రాత్రులు ఎన్ని పగల్లు క్షణాల్లాగడిచిన దినాలు
గొంతుల్లోకి పలుకుల నిషాపానీయాలు వొంపుకుని
గుటకలేసిన దివారాత్రులన్నీ గుర్తున్నాయా?
ఏ గొడుగులు ఎవరు పట్టకపోయినా తడబడుతూనే
 నా అడుగులలో అడుగులేసి నడిచిన నీ పాదాలకు ఏ లేపనం పూయకున్నా
నిన్ను ప్రేమిస్తున్నానంటూ పదేపదే జల్లిన పలుకుల చిరుజల్లులకే
పులకించి పోయిన నా అమాయకపు నెచ్చెలీ నీదే నిజమైన ప్రేమని
ఒప్పుకుంటానులే
నీ నా గమ్యం ఎంతదూరమైనప్పటికీ
మన ప్రయాణం ఎంతకాలమైనప్పటికీ
కడదాక నీతోడుగా నడుస్తానులే
నీ కంటకన్నీరొలకకుండా నా కనురెప్పలను కాపలా పెడతానని
ఎందరు బాటసారులెదురైనా ఎవరివైపూ కన్నెత్తిచూడనని మాటఇస్తున్నా
ఆకలైతే అమ్మలా నాకడుపు నిమురు ఆనందిస్తాను
భయమేస్తే నా చేయిపట్టుకో నాన్నలా నీ భయంపోగొడుతాను
నిదురొస్తే చెప్పు నా యెదనే పట్టుపరుపుగా పరుస్తాను
 నాస్వర్గం నీవు నీసర్వం నేను
నా చూపునీవు నీ కనుపాపనేను
నీదేహం నేను నా ప్రాణంనీవు
నిజంచెప్పాలంటే ఒక ప్రేమ కొమ్మకు పూచిన
రెండు పువ్వులం మనం

★★★



# తిరిగి జన్మనివ్వు..

అస్త్ర

వంటరిగా మిగిలిపోతానేమో అనే ఆందోళన
భూమికి భారమయ్యానేమో అనే సంకోచం
నాతో జీవితం నరకమేమో అనే ప్రశ్నలకు బదులురాక
శోకంలో మునిగిపోయిన నన్ను చూసి,
'చెయ్యి జారిపోయావ్' అని కాలం వెక్కిరిస్తుంది.

ఓదార్చే నీ మాటలకు కరిగి కారణం చెప్పుండాల్సిందా?
చేరదీసినప్పుడు బాధలు పంచుకోవాల్సిందా?
'మనం' అనుకునే రోజుల్లో ఆశ్రయం కోరాల్సిందా?

ఒకప్పుడు నా కంటి చెమ్మను తట్టుకోలేదు
ఇప్పుడు నా కన్నీరు లెక్కలేదు
ఒకప్పుడు నా మౌనాన్ని సహించలేదు
ఇప్పుడు నా మాటలని భరించలేవు
ఒక్కప్పుడు నా వ్యంగ్యానికి ఆగ్రహించలేదు
ఇప్పుడు నా వాస్తవానితో అంగీకరించలేవు

నా తప్పు ఎవరికీ చోటు లేదన్న స్థానం
నా కోసమే ఉందన్న సమయం
నీవు కల్పించిన మనస్థైర్యం
నామ రూపాలూ లేక కాలంతో కొట్టుకుపోయాయి

నా కళ్ళలోని బాధ,
గుండెలోని కలత
జీవితం లోని పోరాటాన్ని
నీ చిరునవ్వుతో దూరం చేసి
బిగుసుకుపోయిన నా మనసును నీ ప్రేమతో కదిలించి
కోల్పోయిన ఆశావాదాన్ని నీ స్పర్శతో పెంపొందించు.

కలగనడానికి స్ఫూర్తిని ప్రేరేపించి
శ్వాసకు కారణం కల్పించి
చిరునవ్వులు చిలకడానికి శక్తిని పెంపొందించి
జీవించడానికి తిరిగి జన్మనివ్వు!

★★★

## వీడ్కోలు విమానం
### డా. కె.గీత

బయటంతా మబ్బు ముసురుకుంది
నా మనస్సులాగే-
ఈ సరికి నువ్వెక్కిన విమానం
ఈ మబ్బుల్ని దాటే ఉంటుంది
అంత సులభంగా నువ్వు దాటగలవని తెలీదు నాకు
రెండు జీవితాలకి - రెండు జీవనాలకి
అలవాటు పడాల్సిన దు:ఖం
అద్దాల్ని జారుతోంది
నీ విమానం కిటికీ
చెమ్మగిల్లిన దృశ్యంలో
వేల ముక్కలై పగిలిన
నా వీడ్కోలు హృదయం
ఎలా భరిస్తూ వెనక్కి జేరబడ్డావో గానీ-
నిన్ను వీడ్కోలు విమానం ఎక్కించిన చివరి నిమిషంలో
నీ కనుకొలుకుల్లో విత్తనాలై మొలిచిన దు:ఖం
నా గొంతులో వృక్షమై మోయలేకున్నాను
నువ్వొచ్చిన ప్రతీసారీ విడవాల్సిన రోదన సత్యం
నువ్వెళ్లిన ప్రతీసారీ మళ్లీ వస్తావన్న భరోసా అసత్యం
మబ్బు కాస్త కాస్త తొలగింది
బాధ అంతకంతకూ ముసురుతూంది
భూమధ్య రేఖ చుట్టూ
పరిభ్రమిస్తూన్న జ్ఞాపకాలు
వాకిట్లో కిరణాలై ప్రసరిస్తూన్నాయి
నీ విమానం ప్రవేశించిన వెలుగురేఖలనుకుంటా-
దు:ఖం వేల చేతుల్తో
హృదయాన్ని నిద్దట్లోనూ జలదరింపజేస్తూంది
నీ విమానపు కుదుపులనుకుంటా-
రెండు జీవితాల - రెండు జీవనాల
మధ్య కవిత్వం ఒక్కటే
నిన్నూ నన్నూ కలుపుతూ-
దు:ఖాలకు, రోదనలకు
ఉదయాలకు, సాయంత్రాలకు
స్వాగతాలకు, వీడ్కోళ్లకు
అతీతంగా-

★★★

## వ్యక్తిత్వం
### రాజశ్రీ

ఎందుకు మీరంతా
సమూహాల వెంట పడి సతమతమై పోతుంటారు?
ఎందుకు మీరంతా
హడావిడిగా వడివడిగా జీవితాన్ని ముగించేస్తుంటారు?
ఎందుకు మీరంతా
తర్కాలకి నిలబడని నమ్మకాలను భుజాలకు ఎత్తుకుంటారు?
ఎందుకు మీరంతా
మీ ఆలోచనలను, ఆదర్శాలను వదిలేసి ప్రక్క వారి బుర్రలతో ఆలోచిస్తూ మీ వ్యక్తిత్వాన్ని సమాధి చేస్తారు?
ఎందుకు మీరంతా
చీకు, చింత వలదని చిన్నచిన్నగ వెళ్లిపోతుంటారు?
ఎందుకు మీరంతా
మారని మీ చూపు కోణం నుండి మనుషులందర్నీ దూరం పెడతారు?
ఎందుకు మీరంతా
పసితనపు అమాయకత్వాన్ని ఇరుకిరుకు గోడల మధ్య బంధిస్తారు?
ఎందుకు మీరంతా
ఊపిరాడని ఆలోచనలతో మస్తిష్కాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తారు?
ఎందుకు మీరంతా
ప్రస్తుతాన్ని అప్రస్తుతం చేసి చెంతలేని దానికై చింతలో పడతారు?
ఎందుకు మీరంతా
రొటీన్ రొంపి లో కూరుక్కుని పోయి ఉదాసీనంగా ఊపిరులు వొదులుతారు?
ఎందుకు మీరంతా
పార, గునపం భుజాలనేసుకొని మీ సమాధులకు మీరే గోతులు తవ్వుకుంటారు?

★★★



# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

ఏనెవరో నీకును మఱి నీవెవరో నాకు
తెలియక గడచెనెన్నియో దినములేండ్లు
కనులు నీవియు నావియు కలిసె నేడు
మనసులును రెండు ప్రేమాబ్ధి మునిగె నేడు

ఇంత కాలమీ యుద్వేగమెచటికేగె?
ప్రేమనెరుగక యెదలు నిద్రించెనెట్లు?
ఎటులనో సాగె జీవితమీవు లేక
తలతునిప్పుడు నీ చిన్నతనము గూర్చి

ముక్కు పచ్చలారని ముద్దు మొగము తోడ
పట్టు పరికిణి దాలిచి, బొట్టు పెట్టి
జడను కుప్పెల గట్టి, నేస్తముల జేర్చి
ఒప్పుకుప్పలనాడుట యూహ జేతు

ఆ చిరుత ప్రాయమందు నిన్నరయనెంచ
మరలి వచ్చునే కాలమ్ము మనల కొరకు?
మరలి వచ్చిన గాని నిన్నరయగలనె?
ఉందువెచటనో, నేనుందునెచటొ!

కలిసి జీవించు భాగ్యమ్ము కలిగెనిపుడు
ప్రణయసుమమయమిక మన బ్రతుకుబాట
మరల శైశవమ్మును మనమరయగలము
ముద్దుమోములు మనకద్దములుగ మారు

